Yuvatharam Telugu Daily

RNI APTEL/2023/88231

# యువతరం

ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు

The Voice of youth

Postal Regd.No. KNL/3-77(D)/2025-2027

తెలుగు దినపత్రిక



**విలేఖరులు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాలలో నూతనంగా ప్రారంభించిన యువతరం తెలుగు దినపత్రిక లో పనిచేయడానికి జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గ ప్రతినిధులు, మండల స్థాయి విలేఖరులు కావలెను.

సంప్రదించవలసిన నెంబర్

9989924749

7013007309




2లో

**సీఎం రేవంత్‌రెడ్డికి టీబీజేపీ చీఫ్ రాంచందర్‌రావు కౌంటర్**


ప్రచురణ : కర్నూలు, అనంతపురం   సంపుటి : 03   సంచిక : 311   పేజీలు : 08,   వెల రూ. 4 రూ/   సోమవారం 08- 06 - 2026

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad,


## మోదీ ఇచ్చిన వజ్రాన్ని సొంతం చేసుకోలేకపోయిన జిల్ బైడెన్.. ఆత్మకథలో ఆసక్తికర విషయాల వెల్లడి



2లో

- ప్రధాని మోదీ బహూకరించిన ల్యాబ్-గ్రోన్ వజ్రంపై జిల్ బైడెన్ ఆసక్తి
- యూఎస్ నిబంధనల ప్రకారం వజ్రం ప్రభుత్వ సొత్తుగా గుర్తింపు
- మోదీ చెప్పిన ధర కంటే అమెరికా అధికారులు కట్టిన విలువే ఎక్కువ
- ధర భారీగా ఉండటంతో సొంతం చేసుకోలేకపోయిన మాజీ ఫస్ట్ లేడీ
- అధికారిక ఈవెంట్లలో ధరించి, వైట్ హౌస్ వీడాక తిరిగి ప్రభుత్వానికి అప్పగింత

**ఢిల్లీ :**

భారత ప్రధాని నరేంద్ర మోదీ గతంలో తనకు బహూకరించిన ఒక అరుదైన వజ్రాన్ని తన వద్దే ఉంచుకోవాలని అనుకున్నానని, కానీ అమెరికా ప్రభుత్వ నిబంధనలు, దాని భారీ విలువల కారణంగా చివరికి దానిని వెనక్కి ఇచ్చేయాల్సి వచ్చిందని అమెరికా మాజీ ఫస్ట్ లేడీ డాక్టర్ జిల్ బైడెన్ వెల్లడించారు. ఈ వారం మార్కెట్లోకి విడుదలైన ఆమె ఆత్మకథ 'వ్యూ ఫ్రమ్ ద ఈస్ట్ వింగ్: ఎ మెమోయిర్' పుస్తకంలో వైట్ హౌస్ జీవితం, విదేశీ పర్యటనల్లో వచ్చే బహుమతులపై ఉండే కఠినమైన నిబంధనల గురించి ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

## ఖనిజాన్వేషణలోనూ ఏఐ... రూ.100 కోట్లతో భారత్ భారీ ముందడుగు



- ఖనిజాన్వేషణ కోసం రూ.100 కోట్లతో ప్రత్యేక కేంద్రం
- బెంగళూరులో ఏర్పాటు చేయనున్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వినియోగం
- భూగర్భంలో దాగి ఉన్న కీలక ఖనిజాల గుర్తింపు లక్ష్యం
- రాబోయే ఐదేళ్లలో 8.5 లక్షల చ.కి.మీ. ప్రాంతంపై విశ్లేషణ

**ఢిల్లీ :**

భారత ఖనిజాన్వేషణ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో కీలకమైన, భూగర్భంలో లోతుగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.100 కోట్ల వ్యయంతో బెంగళూరులో "డేటా ప్రాసెసింగ్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ ఇంటిగ్రేషన్ సెంటర్" - మిగతా 2 లో

## తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు.. కొత్త తేదీ ఇదే!

2లో

- జూన్ 12కు బదులుగా 15న స్కూళ్ల పునఃప్రారంభం
- రెండో శనివారం, ఆదివారం నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తింపు
- ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

## మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



- ఉప్పల్ భగాయత్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన రేవంత్ రెడ్డి
- మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తామని వెల్లడి

**హైదరాబాద్ :**

: పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్ ఎంసీని మూడుగా విభజించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం విభజించామని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఓఆర్ ఆర్ లోపలే దాదాపు 1.34 కోట్ల మంది ఉన్నారన్న సీఎం, అంతమంది జనాభాకు సదుపాయాలు కల్పించడమంటే ఆషామాషీ కాదన్నారు. ఉప్పల్ భగాయత్ తో పర్య టించిన సీఎం రేవంత్ రెడ్డి ఎంఎంసీతో పాటు పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ప్రజల సౌలభ్యం కోసమే ఉప్పల్?లో మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**మూసీ ప్రక్షాళన రెండో విడత కార్యచరణ వెంటనే చేపట్టాలి :**

ఎంపీగా చేయలేని పనులన్నీ ఇప్పుడు సీఎంగా ఉండి చేసేందుకు సిద్ధమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్?కు బండారు రాజిరెడ్డి పేరు పెట్టామన్నారు. బండారు రాజిరెడ్డి విగ్రహం కూడా ఏర్పాటు చేద్దామని చెప్పారు.



2లో

## 'హైడ్రా'కు హిట్లరే స్ఫూర్తి.. సీఎం రేవంత్ వ్యాఖ్యలతో దుమారం


- హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా ఏజెన్సీని ఏర్పాటు చేశానన్న సీఎం రేవంత్
- బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యలు
- రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తీవ్ర ఆగ్రహం
- ఇది కాంగ్రెస్ హిట్లర్, ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనమన్న బీజేపీ
- చారిత్రకంగా రేవంత్ వాదనలో నిజం లేదంటున్న నిపుణులు

**హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో పెను దుమారం రేపుతున్నాయి. రాష్ట్రంలో ఆక్రమణల తొలగింపు, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) వ్యవస్థకు జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో పేరు పెట్టానని ఆయన స్వయంగా చెప్పడమే ఈ వివాదానికి కారణమైంది. బెంగళూరులో నిన్న జరిగిన 'ది హిందూ' హడిల్ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## సత్యనారాయణ గారూ... నేడు మనం సిద్ధాంతంలో కలుద్దాం!

- చంద్రబాబును చూడాలన్న కామధేనువులంక పెద్దాయన
- వైరల్ అయిన వీడియోకు సీఎం చంద్రబాబు స్పందన
- సత్యనారాయణ గారూ.. రేపు కలుద్దాం అంటూ ట్వీట్
- సిద్ధాంతం పర్యటనలో పెద్దాయనను కలవనున్న సీఎం
- సామాన్యుడి కోరికపై ముఖ్యమంత్రి తక్షణ స్పందన





**అమరావతి :**

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియోపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి, ఒక సామాన్య అభిమాని కోరికను తీర్చడానికి ముందుకొచ్చారు. తనను కలవాలని ఆశగా ఎదురుచూస్తున్న పెద్దాయనను ఉద్దేశించి, "సత్యనారాయణ గారూ.. రేపు సిద్ధాంతంలో కలుద్దాం" అని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శుక్రవారం పోస్ట్ చేశారు. అసలేం జరిగిందంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడితో ఒక యువకుడు మాట్లాడిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియోలో, "చంద్రబాబును ఎప్పుడైనా చూశారా?" అని యువకుడు అడగ్గా, "ఆయన హైదరాబాద్‌లో ఉంటారని అంటారు, నేనైతే చూడలేదు" అని పెద్దాయన అమాయకంగా బదులిచ్చారు. "ఆయన్ను కలవాలని ఉందా?" అని అడగ్గా, సత్యనారాయణ గారు ఎంతో ఉత్సాహంగా, చూడాలనే కోరిక ఉందని చెప్పారు. దీంతో ఆ యువకుడు, ఈ నెల 9న ముఖ్యమంత్రి సిద్ధాంతం వస్తున్నారని, తాను తప్పకుండా కలిసేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట వినగానే సత్యనారాయణ గారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ హృద్యమైన వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి చేరింది. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, పెద్దాయన కోరికను మన్నిస్తూ నేరుగా ఆయన్నే కలుస్తానని ప్రకటించారు. సిద్ధాంతంలో తన పర్యటన సందర్భంగా సత్యనారాయణ గారిని కలవనున్నట్లు ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఒక సామాన్యుడి కోరికకు ముఖ్యమంత్రి ఇంత త్వరగా స్పందించడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## టీచర్లు లేని స్కూల్, స్మార్ట్ ట్రాఫిక్ : ఏపీ కోసం రష్యాలో నారా లోకేష్ కీలక భేటీలు



2లో

- ఏపీ యువత భవిష్యత్తే లక్ష్యం
- రష్యాలో మంత్రి నారా లోకేష్ కీలక భేటీలు
- సంక్షోభంలోనూ అవకాశాలు సృష్టించడమే నాయకత్వమన్న లోకేష్
- ప్రవాస భారతీయులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారి అభివృద్ధిలో భాగం కావాలని పిలుపు
- అమరావతి, విశాఖలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం యాండెక్స్ సంస్థతో కీలక చర్చలు
- టీచర్లు లేని వినూత్న 'స్కూల్ 21'ను సందర్శించి, విద్యా విధానాలపై అధ్యయనం

**అమరావతి :**

"సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వం. ఆంధ్రప్రదేశ్ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే అవకాశాలను సృష్టించేందుకే నేను రష్యాలో పర్యటిస్తున్నాను," అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. తన రష్యా పర్యటనలో ఐదో రోజు ఆయన మాస్కోలో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. పెట్టుబడుల ఆకర్షణ, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీకి తీసుకురావడమే లక్ష్యంగా పలు సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు.



2 లో..

## కూటమి ప్రభుత్వానికి ఏపీజేఏసీ హెచ్చరిక.. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమమే!

- ప్రభుత్వ ఉద్యోగుల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- మధ్యంతర భృతి, కొత్త పీఆర్సీ అమలుపై ప్రభుత్వం స్పందించాలని సూచన
- డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమానికి సిద్ధమని ఏపీ జేఏసీ హెచ్చరిక
- ఉద్యమ కార్యాచరణ కోసం 13 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ఏపీఎస్ఆర్టీసీ భవిష్యత్తుపై జరగనున్న మరో కీలక సమావేశం

## ఏపీలో రేర్ ఎర్త్ హబ్.. రష్యా సంస్థతో మాస్కోలో మంత్రి లోకేష్ కీలక భేటీ

- మాస్కోలో రష్యా రేర్ ఎర్త్ సంస్థ 'గిరెడ్‌మెట్'తో మంత్రి నారా లోకేష్ భేటీ
- ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదన
- నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ల తయారీ కేంద్రంపై చర్చలు
- భారత ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లే లక్ష్యంగా ప్రాజెక్టులు
- మాస్కోలోని అణుశక్తి మ్యూజియాన్ని సందర్శించిన లోకేష్





**అమరావతి :**

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశంలో పాల్గొన్నారు. రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ ఖనిజాల సంస్థ 'గిరెడ్‌మెట్ ఇనిస్టిట్యూట్' ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు.

## ఏపీలో '108' సేవలకు కొత్త రూపు

2లో





- ఆంధ్రప్రదేశ్‌లో సమూలంగా మారిన 108 అంబులెన్స్ సేవలు
- జూన్ 2025 నుంచి మే 2026 వరకు 7.78 లక్షల అత్యవసర కేసులకు సేవలు
- భవ్య హెల్త్ కేర్‌తో కలిసి అధునాతన టెక్నాలజీ వినియోగం
- 1.13 లక్షల రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స
- లక్షకు పైగా గర్భిణులను ఆసుపత్రులకు సురక్షితంగా తరలింపు

## హైదరాబాదులో చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం... నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

- నాంపల్లిలో రేపు రాత్రి నుంచి చేప ప్రసాదం పంపిణీ
- తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- నగరంలో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలు
- మృగశిర కార్తె రాత్రి రావడంతో ఈసారి రాత్రి 9 గంటలకు ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి



హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏటా నిర్వహించే బత్తిని సోదరుల చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధమైంది. మృగశిర కార్తెను పురస్కరించుకుని ఆస్తమా రోగులకు అందించే ఈ ప్రసాదం పంపిణీ నేడు (జూన్ 8) రాత్రి 9 గంటలకు ప్రారంభం కానుంది. మృగశిర కార్తె రాత్రి ప్రవేశిస్తుండటంతో ఈ మార్పు చేసినట్లు - మిగతా 2 లో

# తల్లికి వందనం పథకం పేరుతో వచ్చే నకిలీ లింకుల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు.

వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు ఎవరికీ పంచుకోవద్దు.

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



కర్నూలు ప్రతినిధి జూన్ 07 యువతరం న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం పేరుతో సైబర్ నేరగాళ్లు విద్యార్థుల తల్లిదంద్రులను లక్ష్యంగా చేసుకుని నకిలీ లింకులు పంపి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పథకానికి సంబంధించిన దరఖాస్తులు, అర్హత వివరాలు, నగదు జమ తదితర అంశాల పేరుతో వాట్సాప్, ఎస్ఎంఎస్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. అటువంటి లింకుల ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ నంబర్, ఓటీపీలు, పాస్‌వర్డు వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి సైబర్ మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక ప్రభుత్వ వేదికలు, గ్రామ/వార్డు సచివాలయాలు లేదా సంబంధిత అధికారులను మాత్రమే సంప్రదించాలని సూచించారు. తెలియని వ్యక్తులు పంపిన లింకులను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఏటీఎం వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డు ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని తల్లిదంద్రులకు విజ్ఞప్తి చేశారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ .సైబరక్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ పోర్టల్ లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు.

# ఫిట్ ఇండియా 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని ప్రారంభించిన అడిషనల్ ఎస్పీలు



కర్నూలు ప్రతినిధి జూన్ 07 యువతరం న్యూస్ : కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహించిన 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ లు మాట్లాడుతూ ... ప్రతి ఒక్కరూ సైక్లింగ్, వ్యాయామాన్ని అలవాటుగా చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సైక్లింగ్ వల్ల శారీరక దృఢత్వం పెరగడంతో పాటు వాహన కాలుష్యం తగ్గి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. ఈ సైకిల్ ర్యాలీ కొండారెడ్డి బురుజు వద్ద ప్రారంభమై ఓల్డ్ కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్ మీదుగా తిరిగి జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లతో పాటు సీఐలు గుణశేఖర్ బాబు, పార్థసారథి, ఆర్ఐలు నారాయణ, పోతల రాజు, ఆర్ఎస్ఐలు మరియు ఏఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.






కర్నూల్ ప్రతినిధి జూన్ 7 యువతరం న్యూస్ : కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# అగాపే ఆశ్రమంలో అన్నదానం



యాడికి జూన్ 07 యువతరం న్యూస్ ; యాడికి మండలం, కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో హాల్ది అబ్దుల్ సత్తార్, అశబి,మనవరాలు హఫ్సానా 8వ పుట్టినరోజు శుభ సందర్భంగా అన్నదాన కార్యక్రమ ఏర్పాటు చేశారు. హాజీ బాబా జ్యువెలర్స్ బంగారు షాప్ హాల్ది హాజీపిరా, నాజీమా వారి కుమార్తె హఫ్సానా పుట్టినరోజుని ఇంట్లో కాకుండా ఆశ్రమంలోని వారికి అన్నదానం చేయాలని ఆశ చిన్న వయసులో ఆ బిడ్డకు రావడం చాలా సంతోషమని భావించి, తన కోరిక మేరకు అగాపే ఆశ్రమంలోని వృద్ధులకు, నిరాశ్రయులకు భోజనాలు సిద్ధం చేయించి అన్నదానం చేశారు. ఇందు నిమిత్తమై ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా ఆ బిడ్డకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, దీవించి వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

# 47 సంవత్సరాలు అనంతరం పూర్వపు విద్యార్థుల కలయిక

ఘనంగా పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.





కర్నూలు ప్రతినిధి జూన్ 7 యువతరం న్యూస్ : 47 సంవత్సరముల తర్వాత ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు ఆదివారం కర్నూలు నగరంలోని కెఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ లో పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమం డి. హుస్సేన్ సాహెబ్ రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ అధ్యక్షతన కొనసాగింది. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులను కె.శివారెడ్డి కాంట్రాక్టర్, రాయపు .శివారెడ్డి, (రిటైర్డ్) డైరెక్టర్ ఆఫ్ ఫింగర్ ప్రింట్స్ విభాగం, డి హుస్సేన్ సాహెబ్, (రిటైర్డ్) స్పెషల్ కలెక్టర్, మూర్తి మహేశ్వర్ రెడ్డి వ్యాపారవేత్త, ఆకురాల్లు సుబ్రహ్మణము వ్యాపారవేత్త, ఆర్ శివకుమారయ్య రిటైర్డ్ డివిజనల్ పౌర సంబంధాల అధికారి, తదితరులు కలిసి ఒక వేదిక పైకి తీసుకొని వచ్చినందుకు పూర్వపు విద్యార్థులు వారి సంతోషాన్ని వెలిబుచ్చారు. డి.హుస్సేన్ సాహెబ్ (రిటైర్డ్) స్పెషల్ కలెక్టర్, మాట్లాడుతు దాదాపు 47 సంవత్సరాల అనంతరం ఈరోజు మనందరం ఒక వేదికపై కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది అని ఈరోజు మనము ఈ ఉన్నత స్థాయిలో ఉన్నామంటే మన గురువుల ప్రోత్సాహంతో మనము అంచెలు అంచెలుగా ఎదిగి ఈ స్థాయిలో ఉన్నామన్నారు, మనము చదువుకున్న గతంలో సౌకర్యాలు తక్కువ ఉన్న కష్టపడి చదువుకొనామని ప్రస్తుతం యువత కూడా మమ్ములను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని యువతకు తెలియజేస్తున్నామన్నారు. రాయపు శివారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఫింగర్ ప్రింట్ విభాగం. మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులే మహనీయులవుతారు అనే నానుడును దృష్టిలో ఉంచుకొని పట్టుదలతో ఏదైనా సాధించవచ్చును అనుకొని పగిద్యాల గ్రామం నుండి దాదాపు 8 కిలోమీటర్లు దూరంలో ఉన్న ప్రాతకోట లో పదవ తరగతి వరకు చదువుకొని అనంతరం ఉన్నత చదువులను చదువుకొని పోలీస్ డిపార్ట్మెంట్లో చేరి అంచలంచెలుగా పదోన్నతులు పొందుతూ డైరెక్టర్ గా చేరుకొని పదవి విరమణ చేయడం జరిగిందన్నారు. కె.శివారెడ్డి మాట్లాడుతూ దాదాపు 47 సంవత్సరాల తర్వాత విద్యార్థులందరూ ఒక వేదికపై కలవడం చాలా ఆనందంగా ఉందని కానీ ఈ సమయంలో మాకు విద్యను బోధించిన ఒక గురువు కూడా అందుబాటులో లేకపోవడం మాకు చాలా విచారకరంగా ఉన్నది మా గురువులను సత్కరించుకోవాలని ఎంతో కుతూహలముగా ఉండేది. కానీ మాకు అదృష్టం లేదు. అయినా ఇన్ని సంవత్సరాలకు కలవడం ఎంతో ఆనందదాయకం, మేము చదువుకుండే టైములో తాటిపాడు గ్రామం దాదాపుగా 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాతకోటకు వెళ్లి చదువుకునే వారం, అలనాటి తీపి జ్ఞాపకాలను జ్ఞాపకం చేసుకుంటూ ఆనందంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నాం. ఈ కార్యక్రమంలో విద్యా వ్యవస్థ పైన, పూర్వపు విద్యార్థులను ఉత్తేజపరిచే జ్ఞాపకాల పైన గజల్స్ పార్టీ బరువు విద్యార్థులను సంతోషపరిచారు. కార్యక్రమం అనంతరం పూర్వపు విద్యార్థులలో రిటైర్డ్ అయిన వారిని, పూర్వపు విద్యార్థుల కలయికకు కృషిచేసిన వారిని కూడా సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో 1978 మరియు 1979 సంవత్సరం ప్రాతకోట జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదివిన విద్యార్థిని విద్యార్థులు వీరి వీరిగా పాల్గొన్నారు. అనంతరం విందు భోజనంతో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ముగించారు.

# మానవ జన్మ - పరామార్త సోపానం ' ఆధ్యాత్మిక గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమం






కర్నూల్ ప్రతీది జూన్ 07 యువతరం న్యూస్ : ఆదివారం 'మానవ జన్మ పరమార్థ సోపానం' అనే ఆధ్యాత్మిక గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్టేట్ మహిళ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి పాల్గొన్నారు. ఈ మానవ జన్మ ఎంతో విలువైనది. కేవలం భౌతిక విజయాల కోసమే కాకుండా, మన అసలు స్వరూపాన్ని తెలుసుకొని జీవిత పరమార్థాన్ని గ్రహించడానికి ఈ జన్మ ఒక గొప్ప అవకాశం. మానవ జన్మ ఒక సోపానం; ఆ సోపానం ద్వారా పరమార్థాన్ని చేరుకోవడమే మన జీవిత లక్ష్యం అని ఈ శీర్షిక మనకు గుర్తు చేస్తోంది. నేటి వేగవంతమైన జీవితంలో మనిషి బాహ్య ప్రపంచాన్ని జయిస్తున్నాడు. కానీ అంతరంగ శాంతి కోసం వెతుకుతున్నాడు. అలాంటి సమయంలో ఆధ్యాత్మిక గ్రంథాలు మనకు దిక్సూచిలా పనిచేస్తాయి. ఈ గ్రంథం కూడా పాఠకులను ఆత్మపరిశీలన వైపు నడిపించి, సత్ప్రేరణను అందిస్తుందని నేను విశ్వసిస్తున్నాను. ఈ విలువైన గ్రంథాన్ని రచించిన గురుశ్రీ మేఘ శ్యామ్ కి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. వారి ఆలోచనలు మరెందరో పాఠకులకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను. ఈ సందర్భంగా ఈ గ్రంథం వేలాది మంది చేతుల్లోకి చేరి, వారి జీవితాల్లో జ్ఞానం, శాంతి, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. ఈ సంకలనాన్ని పుస్తక రూపం లోకి తీసుకు రావడానికి సహకరించిన ఆత్మీయులు కారుమూడి గణేష్ కి వారి సతీమణి కి హృదయ పూర్వక అభినందనలు స్క్రీన్ టైమ్ కు విలువ నిచ్చే ఈ రోజులలో పుస్తక పఠనాన్ని ఎంకరేజ్ చేస్తూ ప్రజలకు ముఖ్యం గా యువత కు మంచి సందేశాన్ని ఇచ్చే ఒక గొప్ప ఆధ్యాత్మిక గ్రంధాన్ని మానవాళికి అందించిన గణేష్ దంపతులను అందరమూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

# విద్యార్థులకు విద్యా కిట్లు అందించిన డాక్టర్. శంకర్ శర్మ





కర్నూలు ప్రతినిధి జూన్ 7 యువతరం న్యూస్ : కర్నూలు కిడ్స్ వరల్డ్ లో సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు తైక్వాండో లో శిక్షకులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈకార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్న తనం నుంచే మంచి లక్షణాలు కలిగి ఉంటే మంచి పౌరులుగా తయారై దేశానికి పేరు తెస్తారని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. అందులో భాగంగానే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్న ఉద్దేశ్యంతో వారికి తనవంతు కృషిగా ప్రోత్సహిస్తున్నాన్నారు. ప్రపంచంలో భారతదేశం లాంటి గొప్ప దేశం లేదని అందువల్ల అందరూ కలిసి మెలిసి జీవించాలన్నారు. భారతదేశం శాంతికి చిహ్నంగా ఉందన్నారు. త్వరలో పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున విద్యార్థులకు అవసరం అయిన నోట్ బుక్స్, పెన్స్, కంబాక్స్, ప్యాడ్, కలర్ పెన్సిల్స్ సెట్ లను విద్యార్థులకు డాక్టర్. శంకర్ శర్మ అందజేశారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు సమాజంలో మంచి పౌరులుగా ఎలా ఉండాలో వారికి వివరించారు.

# అసత్య ప్రచారాలతో నిజాలను దాచలేరు

ఆరోపణలకు ఆధారాలుంటే చూపాలి

నిజం చెప్పలేక వాస్తవాలను ఎదుర్కోలేక విమర్శలా

విమర్శలకు దిగుతున్న మడ్రి అనిల్ గుండు పోగుల

శివయ్య బొగ్గుల నరసన్న

బెదిరింపులు, అక్రమాలు కబ్జాలు నా ఇంట,వంట్లో లేదు

టిడిపి నేత బొగ్గుల తిక్కన్న. కార్తికేయ



పెద్దకడబూరు జూన్ 7 (యువతరం న్యూస్ ప్రతినిధి) : మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో ఎస్సీ కాలనీలోని సర్వే నెంబర్ 262 ఏ3 లో 3.30 ఎకరాల ఓపెన్ సైట్ ప్రభుత్వ భూమిలో పట్టాలు పొందిన హక్కులను ఏమాత్రం ప్రశ్నించకుండా మిగులు ప్రభుత్వ భూమి ఎంత ఉందో సర్వే చేసి తెలిసి ప్రభుత్వ స్వాధీనంలోనికి తీసుకోమని మాత్రమే నేను జిల్లా కలెక్టర్ కి అర్జీ సమర్పించాను. ఈ ఈ సందర్భంగా బొగ్గుల తిక్కన్న కార్తికేయ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సర్వేనెంబర్ 262లో సబ్ డివిజన్లో 1.66 బ్రిలె గ్రౌండ్, 2.00 ఎకరాలు పోలీస్ స్టేషన్ క్వార్టర్స్, 30 సెంట్స్ పోలీస్ స్టేషన్,1.54 ఎస్సీ కాలనీ, 09 సెంట్ శశి కాలనీ మిగిలిన 252 ఏ3 3.38 ఓపెన్ సెట్ భూమ్ ఉందని అధికారులు తెలుపగా ఇందులో ఉన్న ఒరిజినల్స్ ఎన్ని డూప్లికేట్ పట్టాలు ఎన్ని గుర్తించి మిగులు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నేను జిల్లా కలెక్టర్ ని కోరాను. అయితే జిల్లా కలెక్టర్ అర్జీని పరిష్కరించి ముందుగా బౌండరీ ఫిక్స్ చేసి బౌండరీ లో ఎంతమంది పట్టాదారులు ఉన్నారు. ఎంత భూమి ఖాళీగా ఉందో ఎంత భూమిలో రోడ్డు ఉందో నివేదిక ఇవ్వమని స్థానిక తాసిల్దార్ ను ఆదేశించడం జరిగింది. వారి ఆదేశాల ప్రకారం అధికారులు నోటీసులు జారీ చేసి మీకుఉన్న పట్టా విస్తీర్ణాన్ని తెలపాలని నోటీసులు ఇవ్వడం జరిగింది. కానీ వారిని ఖాళీ చేయమని గాని ఇల్లు ఖాళీ చేస్తామని గాని ఇల్లు కూల్చి వేస్తామని అధికారులు అనలేదు అయితే కొందరు వ్యక్తులు మద్రి అనిల్ గుండెపోగుల శివయ్య బొగ్గుల నరసన్న అసలు సమస్య నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వ భూమి అంశంపై సమాధానం చెప్పలేక నాపై లంచం అడిగాడంటూ నిరాధారమైన ఆరోపణలు చేయడం విచారకరం. ఆరోపణలు చేయడం సులభం వాటిని నిరూపించడం ముఖ్యం. ఎవరినైనా నేను లంచం అడిగినట్లు ఒక్క ఆధారం, ఒక సాక్ష్యం, ఒక ఫిర్యాదు అయిన,చూపించగలిగితే ప్రజల ముందే సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను. అధికారులు ఇచ్చిన నోటీసుకు సమాధానం ఇవ్వలేక వ్యక్తిగత దూషణలు ఆయుధంగా ఉపయోగిస్తున్నారు నిజం చెప్పలేని వారు అబద్ధాలు ప్రచారం చేస్తారు. వాస్తవాలు ఎదుర్కోలేనివారు వ్యక్తిగత విమర్శలకు దిగుతారా. నేను ఏ పట్టాదారుని గాని ఏ ఇంటిని గాని ఎవరిని కూల్చమని అడగలేదు ఎవరిని వేధించమని కోరలేదు, చట్టబద్ధంగా సర్వే చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకోరావాలని మాత్రమే కోరాను. అ వాస్తవాలు బయటపడతాయనే భయంతోనే అసత్య ప్రచారాలకు తెరలేపుతున్నారని, ఈ విషయం ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా ప్రయోజనాల కోసం ప్రత్యేకించి కాలనీ ప్రజల కోసం చేస్తున్న పోరాటాన్ని ఆపలేరు. ఆధారాలు ఉంటే బయట పెట్టండని లేకపోతే అసత్య ఆరోపణలు మానుకొంటే బాగుంటుందన్నారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించాలనే బాధ్యతను స్పష్టంగా పేర్కొన్నది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ (అ) పౌరుల ప్రాథమిక విధి ప్రతి భారత పౌరుడు ప్రజా ఆస్తులను రక్షించాలి మరియు హింసను త్యజించాలి. అని ఈ ఆర్టికల్ పేర్కొంటుంది. ప్రజా/ప్రభుత్వ ఆస్తులను రక్షించడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన విధి. దీనిని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ (అ) స్పష్టంగా నిర్దేశిస్తుంది. ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగితే సంబంధిత రెవెన్యూ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి చర్యలు కోరవచ్చు. రాజ్యాంగం నాకు ఇచ్చిన పౌరవిధిని వినియోగించుకున్నానని ఈ విషయాన్ని అజ్ఞానులైన మద్రి అనిల్ శివయ్య,నరసన్న తెలుసుకోవాలన్నారు. స్వప్రయోనాల కోసం అక్రమాలకు కబ్జాలకు లంచాలకు పాల్పడే వ్యక్తిత్వం బొగ్గుల తిక్కన్న కార్తికేయ ఇంట్లో ను, ఒంట్లోను లేదన్నారు. నేను స్వలాభపరుడనైతే నేను కూడా ఆ ప్రభుత్వ భూమిలో ఒక ఐదు సెంట్లు పట్టా పోంది స్వాధీనం చేసుకునే వాడిని అలాంటి నైజం మనకు లేదు. మా వ్యక్తిత్వం మా మనస్సాక్షి అలాంటి పనులకు ఒప్పుకోదు నైతిక విలువలు కలిగి జీవిస్తాం. ఒకే కుటుంబ సభ్యులు 10 సెంట్లు 15 సెంట్లు 20 సెంట్లు నకిలీ పట్టాలు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు నా దగ్గర ఉన్నాయి ఈభూమి ఎవరు సంపాదించారు. ఎందుకు ఖాళీ భూమికి ఫేక్ పట్టాలు పొందుతున్నారు వీరు అర్హులా లేక అనర్హుల అడిగే హక్కు ప్రతి పౌరుని ఉందన్నారు. వంద సంవత్సరాల కాపురమున్న వాళ్లు ఆరోపించిన వాళ్లకు, గాని వాళ్ల పెద్దలకు గాని అంత వయసు ఉందా వంద సంవత్సరాల క్రితం ఉన్నవాళ్లకి 2005లో ఎలా బట్టలు ఇచ్చారో, అవి ఎందుకు ఆఫీసులో లేవు తెలిపేదాంట్లో మాట్లాడేదాంట్లో అర్థం ఉందా. ప్రభుత్వం అధికారులు మిగులు భూమి ఎంత ఉందో తేల్చేంతవరకు నా పోరాటం కొనసాగిస్తాను. మిగులు భూములో సైతం కాలనీకీ, మంజూరయ్యే ప్రభుత్వ కార్యాలయాల్ని నిర్మించాలని డిమాండ్ చేస్తా ఇప్పటికీ కాలనీ 3 వా వార్డ్ కు అంగన్వాడి భవనం లేదు, దళితులకు సరైన కమ్యూనిటీ హాలు లేదు, హెల్త్ క్లినిక్ భవనం లేదు కేవలం స్థలం చూపకనే భవన నిర్మాణాలు ఆగిపోతున్నాయి, భవిష్యత్తులో విద్యాశాఖ మంత్రి ఇచ్చే ఇంగ్లీష్ మీడియం స్కూల్ కూడా ఇక్కడే నిర్మించాలని డిమాండ్ చేయడం మా హక్కు అని ఇందులో స్వ ప్రయోజనం ఏముందో నిరాధారమైన ఆరోపణలు చేసిన వ్యక్తులు గమనిస్తే బాగుంటుందన్నారు.

# రాయలసీమలోనే అగ్రస్థానంలో సరస్వతీ విద్యామందిరం

## 100 శాతం ఫలితాలతో చరిత్ర సృష్టించిన ప్రధానాచార్యుడికి విశాఖలో ఘన సన్మానం

పామిడి, జూన్ 7 (యువతరం న్యూస్): విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలకు ప్రతీకగా నిలుస్తున్న విద్యాభారతి శ్రీ సరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాల మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి రాయలసీమ వ్యాప్తంగా ఉన్న విద్యామందిరాలలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ విశిష్ట విజయానికి గాను పాఠశాల ప్రధానాచార్యులు సి.ఆర్. శ్రీనివాసన్‌ను విశాఖపట్నంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు. క్షేత్ర అధ్యక్షులు చామర్తి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు గొల్లపల్లి నాగేశ్వరరావు, సంఘటనా కార్యదర్శులు లింగం సుధాకరరెడ్డి, లక్ష్మణరావుల చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.రాయలసీమ ప్రాంతంలోని అన్ని సరస్వతీ విద్యామందిరాలలో ఈ ఏడాది 100 శాతం ఫలితాలు సాధించిన ఏకైక పాఠశాలగా పామిడి సరస్వతీ విద్యామందిరం నిలవడం విశేషం. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం,



తల్లిదండ్రుల సహకారం ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.అదేవిధంగా, పదో తరగతిలో 540కు పైగా మార్కులు సాధించి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ప్రతిభావంతులైన విద్యార్థులను త్వరలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రబంధకారిణి కమిటీ ఆధ్వర్యంలో షీల్డులు,



ప్రశంసా పత్రాలతో సన్మానించనున్నట్లు వెల్లడించింది.

# పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



## ఘనంగా అల్లపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్లాటినం జూబ్లీ వేడుకలు.

రేపల్లె, జూన్ 07, యువతరం న్యూస్: పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ పేర్కొన్నారు. నగరం మండలం ఉల్లిపాలెంలోని అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాపించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. 1950-2026 కాలానికి గుర్తుగా నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో 10వ తరగతి గోల్డెన్ బ్యాచ్ ఆధ్వర్యంలో 40 అడుగుల సుదీర్ఘ జాతీయ జెండా ఆవిష్కరణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థులు, పూర్వ విద్యార్థులను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో



శ్రీదేవి, విచారపు వీరయ్య, మేకా శివరామకృష్ణ, తాతా ఏడుకొండలు, పంతాని సాయికుమార్, కోపనాతి రాజశేఖర్, దండుప్రోలు పిచ్చియ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చరిత్ర, అభివృద్ధి, పూర్వ విద్యార్థుల సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు



ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. భారీ సంఖ్యలో పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిద్రమత్తులో విద్యాశాఖ అధికారులు ఏఐఎస్ఎఫ్

## పాఠశాల ప్రచార సామాగ్రి దగ్ధం

కోడుమూరు జూన్ 7 యువతరం న్యూస్ : కోడుమూరు పట్టణంలో గత రెండు నెలలుగా జీనియస్ గ్లోబల్ పాఠశాల ప్రచారం చేస్తుంటే ఆదివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు పట్టణంలో కోట్ల కూడలిలో ప్రచార సామాగ్రిని చించివేసి దగ్ధం చేసి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి సర్కిల్ నందు ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడుతూ గత రెండు నెలలుగా ప్రభుత్వం అనుమతి లేకుండా ప్రచారం చేస్తూ అడ్మిషన్స్ నిర్వహిస్తున్న జీనియస్ గ్లోబల్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా ఆ పాఠశాలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని,ఈ పాఠశాల మాత్రమే కాకుండా మండలంలో ఉన్న అనేక ప్రైవేట్ పాఠశాలల ఫీజులకు హద్దుపద్దు లేకుండా పోయిందని, ఇష్టానుశారంగా ఫీజులు పెంచుకుంటూ పోతున్నారని, ప్రభుత్వ జీవోల ప్రకారం అసలు




అడ్మిషన్ ఫీజు వసూలు చేయకూడదు అని ఉన్నా దానిని ఎవరు పట్టించుకోవడం లేదని, విటన్నింటిని అరికట్టాల్సిన మండల విద్యాధికారులు కేవలం ఆఫీస్ లకే పరిమితం అయ్యారని, ఇంతవరకు మండల విద్యాశాఖ అధికారులు మండలంలో ఏ ఒక్క పాఠశాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు మేల్కొని తనిఖీలు నిర్వహించాలని, గుర్తింపు లేకుండా అడ్మిషన్స్ నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ గా డిమాండ్ చేస్తున్నాము. లేనిపక్షంలో తర్వాత జరిగే తీవ్ర పరిణామాలకు విద్యాశాఖ అధికారులు పూర్తి బాధ్యత వహించాలని ఏఐఎస్ఎఫ్ గా హెచ్చరిస్తున్నాము. లేనిపక్షంలో విద్యార్థిని విద్యార్థులు కలుపుకొని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల జిల్లా ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు డి.వీరేంద్ర కార్యదర్శి అల్తాఫ్ బాషా నాయకులు సిద్దు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఎస్ఐ జయ శేఖర్

కొత్తపల్లి జూన్ 6 యువతరం న్యూస్: డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటం చాలా అవసరమని కొత్తపల్లి ఎస్సై అర్.జయ శేఖర్ ప్రజలకు సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ సైబర్ మోసగాళ్ల నుంచి రక్షణ పొందడానికి మరియు ఆన్‌లైన్ భద్రతను పాటించడానికి ఈ క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు.సైబర్ నేరగాళ్లు వాట్సాప్, టెలిగ్రామ్ లేదా ఎస్ఎంఎస్ ల ద్వారా నకిలీ ఏపీకే ఫైల్స్ మరియు అనధికారిక యాప్‌ల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి, ఎందుకంటే వీటి ద్వారా స్మార్ట్‌ఫోన్‌లు హ్యాక్ అయ్యి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉంది. సైబర్ నేరగాళ్లు వాట్సాప్, ఎస్ఎమ్ఎస్ లేదా సోషల్ మీడియా లింకుల ద్వారా ఆకర్షణీయమైన ఆఫర్లు, నకిలీ లోన్‌లు లేదా ప్రభుత్వ పథకాల పేరిట ఈ -చలనా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పీఎం కిసాన్, ట్రాఫిక్ చలానా లు ఇన్విటేషన్ లింకులు పంపిస్తారన్నారు.అమాయకపు ప్రజలే లక్ష్యంగా సైబర్? కేటుగాళ్లు రోజుకో ఓ కొత్త తరహా దోపిడీకి పాల్పడుతున్నారు. ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైతే, ఆలస్యం చేయకుండా వెంటనే కేంద్ర ప్రభుత్వ జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు లేదా అధికారిక పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చు అని తెలిపారు.



# ఎరువులపై కేంద్రం విధానం మారాలి

దేశవ్యాప్తంగా అన్ని రకాల ఎరువులను కలిపి సుమారు 6 కోట్ల 20 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగిస్తున్నారు. ఇందులో తెలంగాణ వినియోగం సుమారు 44 లక్షల మెట్రిక్ టన్నులు, అంటే జాతీయ స్థాయిలో 7 శాతానికి సమానం. అలాగే మొత్తం దేశంలో రెండు సీజన్లు కలిపి ఒక సంవత్సరంలో సాగవుతున్న విస్తీర్ణం 54 కోట్ల 84 లక్షల ఎకరాలు, అందులో తెలంగాణ వాటా 4 శాతం మాత్రమే. అంటే, 4 శాతం సాగు విస్తీర్ణంతో ఉన్న తెలంగాణ, దేశ ఎరువుల వినియోగంలో 7 శాతం వాటా కలిగి ఉండటం వల్ల, రాష్ట్రంలోని సగటు ఎరువుల వినియోగం దేశ సగటుతో పోలిస్తే దాదాపు 80 శాతం అధికంగా ఉందని అర్థమవుతున్నది. అంతేకాక, వినియోగంలో వివిధ రకాల ఎరువుల మధ్య సమతుల్యత లోపించడమే కాకుండా, వాటి మధ్య వ్యత్యాసం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా వినియోగిస్తున్న ఎరువుల్లో 60 శాతం వరకు యూరియానే ఉంది. తెలంగాణ యూరియా వాటా సుమారు 43 శాతం. అయితే తెలంగాణలో గత 7, 8 సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది యూరియా వినియోగం సుమారు ఒక లక్ష మెట్రిక్ టన్నులు పెరుగుతూ వస్తోంది. దీనికి ప్రధాన కారణాలు భూగర్భజలాల పరిమాణం పెరగడం, సాధారణ వర్షపాతం నమోదవడం వల్ల రెండవ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడమే. ఇటీవల యూరియా కొరతపై రైతుల్లో ఆందోళనకు అసలు కారణం యూరియా వినియోగం అనూహ్యంగా పెరగడం కాదు. సాధారణంగా, ప్రతి పంట సీజన్ ప్రారంభ దశలో యూరియా చాలా తక్కువ మోతాదులో వేయాలి. అయినా, చాలా సందర్భాల్లో రైతులు ముందస్తుగా ఎక్కువ మొత్తంలో యూరియాను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా, యూరియాకు ఉన్న నికర ధర ఇతర ఎరువులతో పోలిస్తే చాలా తక్కువగా ఉండటంతో, అవసరం ఉన్నా లేకపోయినా ఎక్కువగా వాడుతున్నారు. వాస్తవానికి, పంట సీజన్ తొలి మాసంలో ఎక్కువగా వాడాల్సిన ఎరువులు డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ వంటి పోషక ఎరువులే. కానీ, ఈ ఎరువుల ధరలు యూరియాతో పోలిస్తే దాదాపు 6 నుంచి 7 రెట్లు ఎక్కువగా ఉండటంతో, రైతులు యూరియాపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ధరల వ్యత్యాసం వల్ల అవసరానికి మించి యూరియా వినియోగం పెరుగుతున్నది. ప్రస్తుతం 45 కిలోల యూరియా బస్తా ధర రూ.266 కాగా, ఇదే పరిమాణంలో డీఏపీ లేదా కాంప్లెక్స్ ఎరువులకు రూ.1500 నుంచి రూ.1800 వరకు ధర ఉంది. ఈ ధరల వ్యత్యాసానికి మూల కారణం కేంద్ర ప్రభుత్వపు లోపభూయిష్ఠ ఎరువుల ధరల విధానమే. దీనివల్ల యూరియా వినియోగం రోజురోజుకీ పెరుగుతున్నది. అదే సమయంలో, డీఏపీ,



కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఆ స్థాయిలో పెరగకపోవడంతో, ఎరువుల వినియోగంలో అసమతుల్యత పెరుగుతోంది. ప్రస్తుత ఎరువుల సబ్సిడీ విధానం ప్రకారం, యూరియాపై దాదాపు 90శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అదే సమయంలో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులపై 60శాతం నుంచి 65శాతం సబ్సిడీ మాత్రమే ఉంది. ఉదాహరణకు, 45 కిలోల యూరియా బస్తాకు వాస్తవ వ్యయం రూ.2800 ఉన్నా, రైతు ప్రస్తుతం చెల్లిస్తున్న ధర కేవలం రూ.266 మాత్రమేబీ మిగతా మొత్తం కేంద్ర ప్రభుత్వ సబ్సిడీయే. ఇదే యూరియాపై 1970లో కేవలం 10శాతం సబ్సిడీ ఉండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఉదాహరణకు, ప్రస్తుతం ఒక కిలో నత్రజనిపై కేంద్ర ప్రభుత్వం రూ.43 సబ్సిడీ ఇస్తోంది. అదే సమయంలో, ఒక కిలో పొటాష్‌పై కేవలం రూ.2.40, ఒక కిలో సల్ఫర్‌పై రూ.2.60 మేరకే సబ్సిడీ ఉంది. ఈ విధమైన ధరల అసమతుల్యత, సబ్సిడీలో వ్యత్యాసం వల్ల, యూరియాపై రైతులు ఆధారపడుతున్నారు.

# కురువ సంఘం అధ్యక్షునిగా బత్తిని జీవన్ కుమార్






ఆస్పరి జూన్ 7 యువతరం న్యూస్ : ఆస్పరి మండలం కురువ సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా బత్తిని జీవన్ కుమార్ ఎన్నుకున్నారు ఆదివారం ఆదోనిలో రాష్ట్ర కురువ సంఘం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశంలో అధ్యక్షుడు మల్లికార్జున కురువ సంఘం చైర్మన్ మన్వి దేవేంద్రప్ప ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆస్పరి మండల పరిధిలోని అట్టేకల్ గ్రామానికి చెందిన బత్తిని జీవన్ కుమార్ ( చిట్టి ) ఆస్పరి మండల కురువ సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా జీవన్ కుమార్ మాట్లాడుతూ కురువ కురుబ సంఘాన్ని సంబంధించిన ప్రతి ఒక్కరూ ఆర్థికంగా విద్యా పరంగా ఎదగాలని అన్నారు తనలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో కురువ సంఘాన్ని ప్రతి గ్రామంలో బలోపేతం చేస్తామన్నారు అలాగే తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవటంతో కురువ కురుబ రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులకు మరియు మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది

# తెలంగాణ రన్ 2026లో నల్లమల రన్నర్స్ సందడి



నాగర్ కర్నూల్ ప్రతినిధి జూన్ 7యువతరం న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన "తెలంగాణ రన్--2026" కార్యక్రమంలో నల్లమల రన్నర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ రన్‌లో పాల్గొన్న సభ్యులు తెలంగాణ స్ఫూర్తిని చాటుతూ ఆరోగ్యకర జీవనశైలికి తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా రన్నర్లు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో వ్యాయామం, నడక, పరుగు వంటి శారీరక కార్యకలాపాలను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లమల రన్నర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు యాదగిరి, సలేశ్వరం, ఆవుల శివ, వేముల మల్లేష్, ప్రసాద్ చారి, సురేష్, సాయి ప్రకాష్, కాట్రాజ్ మల్లేష్, అశోక్, శ్రీను, ఆవుల మహేష్, వినయ్, కమలాకర్, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

# డోన్ లో శ్రీశ్రీశ్రీ సాయిబాబా మందిరములకు రూ:50,116/- విరాళం

(డోన్ ప్రతినిధి జూన్ 7 యువతరం న్యూస్) : డోన్ పట్టణంలో శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబా మందిరమునకు జొన్నగొర్ల తిరుపాలు ధర్మపత్ని లక్ష్మిదేవి, వారి కుమారులు జె.రాము,జె.లక్ష్మన్, షిరిడీ సాయిబాబా మందిరంనకు విరాళం రూ:50,వేల116, రూపాయలు సాయిబాబా కమిటీకి వారికి అందజేశారు.



# పదవి విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి




(డోన్ ప్రతినిధి జూన్ 7 యువతరం న్యూస్) : డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్ నందు కె.కేశవరెడ్డి ఎం ఏ ఎం ఈ డి.(ఎస్ జి టీచర్) పదవి విరమణ సన్మాన కార్యక్రమములో పాల్గొన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




కొత్తపల్లి జూన్ 6 యువతరం న్యూస్: మండల కేంద్రంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 సంవత్సరంలో పదవ తరగతి చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆనాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు పూలమాలలు శాల్వాలతో ఘనంగా సన్మానించి ఉపాధ్యాయుల ఆశీర్వచనం తీసుకున్నారు. 21 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకున్న స్నేహితులు తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఆ రోజుల్లో ఒకచోట చదువుకున్న నేడు ఎక్కడెక్కడో స్థిరపడ్డ అందరం కలిసి మెలిసి ఒకరి కష్టసుఖాలను పంచుకుంటూ, నిజమైన పేదవారికి తోచిన ఆర్థిక సాయం అందిస్తూ చేయూతనివ్వాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థినులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మీ ఇంట్లో మట్టి కుండలు ఉన్నాయా.. ఈ దిక్కున పెడితే లక్ష్మీ కటాక్షం!



మట్టికుండ ఇంట్లో ఉంటే ప్రతికూల శక్తి తొలగిపోతుంది.. ఇంటి మొత్తానికి సానుకూల శక్తి వస్తుంది. దీంతో కుటుంబం మొత్తం సంతోషంగా ఉండొచ్చు. మట్టికుండని ఇంట్లో ఉంచితే మనసుకు శాంతి కలుగుతుంది. సరైన దిశలో మట్టికుండను ఉంచితే శక్తి సమతుల్యం అవుతుంది. దీంతో మానసిక సమస్యలు రావు. మట్టితో తయారు చేసిన కుండను ఇంట్లో ఉంచడం వల్ల ఇంట్లో సానుకూల శక్తి వ్యాపిస్తుంది. మట్టికుండ భూమి తత్వానికి దగ్గరగా ఉండడంతో ప్రతికూల శక్తిని తొలగుతుంది. మట్టికుండ ఇంట్లో ఉంటే ప్రతికూల శక్తి తొలగిపోతుంది.. ఇంటి మొత్తానికి సానుకూల శక్తి వస్తుంది. దీంతో కుటుంబం మొత్తం సంతోషంగా ఉండొచ్చు. మట్టికుండని ఇంట్లో ఉంచితే మనసుకు శాంతి కలుగుతుంది. సరైన దిశలో మట్టికుండను ఉంచితే శక్తి సమతుల్యం అవుతుంది. దీంతో మానసిక సమస్యలు రావు. ఆర్థిక శ్రేయస్సుఇంట్లో మట్టికుండను ఉంచడం లేదా మట్టికుండల తులసి మొక్కను పెంచడం వంటివి చేస్తే ఆర్థిక సమస్యలు తగ్గుతాయి. సంపద, శ్రేయస్సు రెండూ కలుగుతాయి. మట్టికుండను ఇంట్లో పెట్టడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు తగ్గుతాయి. ఇంట్లో మట్టికుండ ఉంటే కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయి. సానుకూల శక్తి ప్రవహించి ఇంట్లో అందరూ కలిసిమెలిసి ఉంటారు. మట్టికుండను ఇంట్లో ఉంచడం వల్ల ఇంట్లో అందరి ఆరోగ్యం కూడా బాగుంటుంది. వివిధ రకాల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. మట్టికుండలో నీరు తాగితే మరీ మంచిది. మట్టికుండను పూజ గదిలో ఉంచడం వల్ల ఇంటి మొత్తానికి సానుకూల శక్తి ప్రవహిస్తుంది. భక్తితో చేసే పూజకు శక్తి కలుగుతుంది. మట్టికుండ పర్యావరణానికి ఎలాంటి హాని చేయదు. ప్రకృతికి నష్టమే ఉండదు. మట్టికుండ వాడితే పర్యావరణానికి మేలు జరుగుతుంది.

## బచ్చలికూర ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదులుకోరు!



బచ్చలి కూరలో రెండు రకాలు ఉన్నాయి. తీగబచ్చలి, కాడబచ్చలి. ఎక్కువగా కాడబచ్చలి మనకి దొరుకుతుంది. తీగబచ్చలిని ఇంటి పెరట్లోకూడా పెంచుకోవచ్చు. ఈ కూరలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఈ ఆకుకూర తినడం వల్ల శరీరానికి ఎలాంటి లాభాలు కలుగుతాయి..? దీనివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ చూద్దాం... ఆకుకూరల్లో బచ్చలి కూరకి ప్రత్యేకమమైన స్థానం ఉంది. దీనిలో పోషకాలతో పాటు అనేకరకాల ఆరోగ్య ప్రయోజనాలు నిండివున్నాయి. ఈ బచ్చలి కూరలో రెండు రకాలు ఉన్నాయి. తీగబచ్చలి, కాడబచ్చలి. ఎక్కువగా కాడబచ్చలి మనకి దొరుకుతుంది. తీగబచ్చలిని ఇంటి పెరట్లోకూడా పెంచుకోవచ్చు. ఈ కూరలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఈ ఆకుకూర తినడం వల్ల శరీరానికి ఎలాంటి లాభాలు కలుగుతాయి..? దీనివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ చూద్దాం ఇందులో సెలీనియం, నియాసిన్ , ఒమేగా 3ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉండటం వల్ల మెదడు, నరాల ఆరోగ్యానికి మంచిది. బచ్చలి ఆహారంలో చేర్చుకోవటంవల్ల చర్మానికి కొత్త మెరుపును ఇస్తుంది. బచ్చలి ఆకు రసానికి చెంచాడు తేనె కలిపి ప్రతిరోజూ తీసుకుంటే రక్తహీనత సమస్య తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునేవారు బచ్చలి కూరను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలి. బచ్చలి ఆకులను కందిపప్పుతో తింటే గర్భిణీలు ఎదుర్కొనే మలబద్ధకం సమస్య తగ్గుతుంది. బచ్చలికూర శరీరంలోని వేడిని తగ్గిస్తుంది.. కొన్ని ఆకులు నూరి కణతకు పెడితే.. తలలోని వేడి కూడా తగ్గుతుంది. బచ్చలి కూరలో పొటాషియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడానికి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడతాయి. బచ్చలి కూరలో విటమిన్ ఎ, లుటీన్ పుష్కలంగా ఉంటాయి, ఇవి కంటి ఆరోగ్యానికి ముఖ్యమైనవి. బచ్చలి కూరలో విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడతాయి. బచ్చలి కూరలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

**21రోజులు క్రమం తప్పకుండా కొబ్బరి నీళ్లు తాగితే శరీరంలో జరిగేదిఇదే**

మూత్రవిసర్జనలో సమస్యలు ఉన్నవారు రోజూ బచ్చలికూర కషాయాన్ని తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడకుండా కాపాడుతుంది. బచ్చలి ఆకుల రసాన్ని కాలిన పుండ్ల మీద పెడితే పుండ్లు తగ్గుతాయి. పచ్చకామెర్లు వచ్చి తగ్గాక బచ్చలి కూర తింటే త్వరగా కోలుకుంటారు. దీంతో తరచుగా వచ్చే దగ్గు, పైత్యం, అతిదాహం సమస్యలు తీరతాయి. కీళ్లనొప్పుల సమస్యలు, పైల్స్ సమస్యలు, శరీరంలో కొవ్వు తగ్గడానికి బచ్చలికూర మంచి ఆహారం. అదే విధంగా బచ్చలి ఆకులను రోజుకు రెండు పూటలా నమిలి మింగుతూ ఉంటే నాలుక మీద ఏర్పడే పొక్కులు తగ్గిపోతాయి.

## ఆపిల్స్‌లో ఎలాంటి విటమిన్లు ఉంటాయో తెలుసా..? ఈ సమస్యలకు మాత్రం రామబాణమే..!




చెప్పాలంటే..ఆపిల్స్ మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అందుకే రోజుకో ఆపిల్ తింటే డాక్టర్‌తో అవసరమే ఉండదని వైద్యులు కూడా చెబుతుంటారు. అలాంటి ఆపిల్‌లో లభించే విటమిన్లు, పోషకాల గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా..? ఆపిల్స్ ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు ఎలా ఉపయోగపడతాయి..? అవన్నీ మనకు ఎందుకు మంచివో ఇప్పుడు చూద్దాం... ఆపిల్.. ఈ చిన్న పండు ఆరోగ్యానికి అమృతాన్నిచ్చే శక్తులను కలిగి ఉందని చెబుతారు. ఆపిల్స్ రుచికరమైనవి మాత్రమే కాదు, వాటి విటమిన్లు, పోషకాలు వాటిని ఆరోగ్య బూస్టర్‌గా చేశాయి. అందుకే రోజుకో ఆపిల్ తింటే డాక్టర్‌తో అవసరమే ఉండదని వైద్యులు కూడా చెబుతుంటారు. అలాంటి ఆపిల్‌లో లభించే విటమిన్లు, పోషకాల గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా..? ఆపిల్స్ ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు ఎలా ఉపయోగపడతాయి..? అవన్నీ మనకు ఎందుకు మంచివో ఇప్పుడు చూద్దాం

**ఆపిల్స్ ఉండే ఉండే ముఖ్యమైన విటమిన్లు:**

ఆపిల్.. మంచి పోషకాలతో కూడిన పండు. ఇందులో వివిధ రకాల విటమిన్లు ఉంటాయి. ఆపిల్స్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. అదనంగా , ఆపిల్స్‌లో విటమిన్ ఎ, విటమిన్ ఇ , విటమిన్ కె, విటమిన్ బి కాంప్లెక్స్ కూడా ఉంటాయి.???

**21రోజులు క్రమం తప్పకుండా కొబ్బరి నీళ్లు తాగితే శరీరంలో జరిగేదిఇదే**

ఆపిల్స్‌లోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ గుండె ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. యాపిల్స్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. బరువు తగ్గడం నుండి మధుమేహం వరకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆపిల్స్ లో కేలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గడానికి సహాయపడతాయి. ఆపిల్స్ తినడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండి ఉంటుంది. అనవసరంగా తినడం తగ్గుతుంది. ఇంకా, ఆపిల్స్ లో పాలీఫెనాల్స్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి .

## బాదంనూనెను తాగవచ్చా..? దీంతో ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి..?



బాదంపప్పును తినడం వల్ల ఎన్ని ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. బాదంపప్పును తింటే అనేక పోషకాలు లభిస్తాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. పలు వ్యాధులను నయం చేస్తాయి. బాదంపప్పును రోజూ నీటిలో నానబెట్టి తినాలని పోషకాహార నిపుణులు, వైద్య నిపుణులు సూచిస్తుంటారు. బాదంపప్పులతో స్వీట్లను కూడా తయారు చేస్తుంటారు. అయితే బాదంపప్పు మాత్రమే కాదు, దీని నూనె కూడా మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. బాదంనూనెలో రెండు రకాలు ఉంటాయి. ఒకటి బిటర్ ఆల్మండ్ ఆయిల్ కాగా మరొకటి స్వీట్ ఆల్మండ్ ఆయిల్. బిటర్ ఆల్మండ్ ఆయిల్ పేరుకు తగినట్లుగానే చేదుగా ఉంటుంది. దీన్ని ఔషధంగా లేదా మసాజ్ కోసం వాడుతారు. కనుక దీన్ని లోపలికి తీసుకోకూడదు. కానీ స్వీట్ ఆల్మండ్ ఆయిల్‌ను మాత్రం నేరుగా లోపలికి తీసుకోవచ్చు. లేదా వంటకాల్లోనూ ఉపయోగించవచ్చు. ఈ క్రమంలోనే స్వీట్ ఆల్మండ్ ఆయిల్ వల్ల మనకు అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి.

**గుండె ఆరోగ్యానికి..**

స్వీట్ ఆల్మండ్ ఆయిల్ లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ నూనెలో ఓలియిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది. ఇది ఒమెగా 9 ఫ్యాటీ యాసిడ్ల జాబితాకు చెందుతుంది. అందువల్ల ఈ నూనెను తీసుకుంటే శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల గుండె సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. బాదంనూనెలో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్ మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా ఉండేలా చేస్తాయి. దీంతో చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. బద్ధకం పోతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. తియ్యని బాదంనూనెను స్వల్ప మొత్తాల్లో తీసుకుంటే సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గుతుంది.

**చర్మ సంరక్షణకు..**

బాదం నూనెలో విటమిన్ ఇ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోజూ ఒక టేబుల్ స్పూన్ తియ్యని బాదంనూనెను తీసుకోవడం వల్ల విటమిన్ ఇ అధికంగా లభించి కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తుంది. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. బాదంనూనెను చర్మానికి లేదా శిరోజాలకు రాయవచ్చు. ఇది మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. చర్మానికి కావల్సిన తేమను, మృదుత్వాన్ని అందిస్తుంది. పొడి చర్మం ఉన్నవారికి మేలు చేస్తుంది. బాదంనూనెలో ఉండే విటమిన్ ఇ వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తుంది. దీంతో ముఖం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తారు. బాదంనూనెలో ఉండే యాంటీ ఫంగల్ గుణాలు జుట్టు కుదుళ్ల వద్ద ఉండే దురదను తగ్గిస్తాయి. చుండ్రు నుంచి బయట పడేలా చేస్తాయి. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి.

**ఎలా తీసుకోవాలి..?**

స్వీట్ ఆల్మండ్ ఆయిల్‌ను కొందరు వంట నూనెగా కూడా ఉపయోగిస్తారు. కొందరు నేరుగా తీసుకుంటారు. అయితే ఫుడ్ గ్రేడ్, అన్ రిఫైన్డ్, వర్జిన్ అనే పేర్లతో ఉండే స్వీట్ ఆల్మండ్ ఆయిల్‌ను వాడడం మంచిది. ఇలా లభించూ నూనె అధిక నాణ్యతను కలిగి ఉంటుంది. పోషక విలువలు అధికంగా ఉంటాయి. బిటర్ ఆల్మండ్ ఆయిల్‌ను లోపలికి తీసుకోకూడదు. కానీ చర్మం లేదా శిరోజాలకు రాయవచ్చు. తియ్యని బాదంనూనెను ఒక టేబుల్ స్పూన్ మోతాదులో తీసుకుంటే 120 క్యాలరీల శక్తి లభిస్తుంది. మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు 9.4 గ్రాములు, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు 2.3 గ్రాములు లభిస్తాయి. విటమిన్ ఇ ని అధిక మొత్తంలో పొందవచ్చు. స్వీట్ ఆల్మండ్ ఆయిల్‌ను కేవలం వంటల్లోనే కాక సలాడ్స్, స్మూతీలపై చల్లి కూడా తీసుకోవచ్చు. ఇలా ఈ నూనెను తీసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## ప్రతిభావంతులకు గాలం.. అమెరికా కఠిన నిబంధనలతో నిపుణులను ఆకర్షిస్తున్న ఇతర దేశాలు

**హెచ్1బీ వీసాపై అమెరికా కఠిన నిబంధనలతో నిపుణులను ఆకర్షించేందుకు ఇతర దేశాల యత్నాలు**

**నిపుణులకు వీసా ఫీజుల రద్దుకు బ్రిటన్ సర్కారు యోచన**

**హెచ్1బీ తరహాలో కే వీసా ప్రకటించిన చైనా ప్రభుత్వం**




విదేశీ ప్రతిభావంతులకు ఇచ్చే హెచ్-1బీ వీసా ఫీజును అనూహ్యంగా లక్ష డాలర్లకు పెంచి ప్రతిభావంతులైన ఉద్యోగుల రాకకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బ్రేక్ వేసిన వేళ.. అలాంటి ప్రతిభావంతులను ఒడిసిపట్టడానికి ఇతర దేశాలు సన్నద్ధమవుతున్నాయి. నిపుణులను తమ దేశానికి ఆకర్షించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. అమెరికా హెచ్1బీ తరహాలో చైనా కే వీసాను ప్రకటించింది. బ్రిటన్ కూడా ప్రతిభావంతులకు వీసా ఫీజును రద్దు చేయాలని నిర్ణయించింది. మరో భారత్ కూడా నిపుణులైన ప్రవాసీయులను తిరిగి స్వదేశానికి ఆహ్వానిస్తున్నది.

**కే-వీసా ప్రకటించిన చైనా**

తన ఇమిగ్రేషన్ రూల్స్‌లో చైనా స్టేట్ కౌన్సిల్ భారీ మార్పులు చేసి కొత్తగా కే-వీసాను ప్రకటించింది. సైన్స్, టెక్నాలజీ, ఇతర స్టెమ్ రంగాల్లోని యువ విదేశీ ప్రతిభావంతులను ఆకర్షించడమే లక్ష్యంగా దీనిని ప్రకటించింది. ఈ కే-వీసాను చాలా సులభంగా పొందవచ్చునని తెలిపింది. దీనికి స్థానిక కంపెనీల స్పాన్సర్ షిప్ అవసరం ఉండదు.

**నిపుణులకు బ్రిటన్ స్వాగతం**

మొన్నటి వరకు వలస ఉద్యోగులను ఎలా పంపాలా అని కిందామీద పడిన యూకే ప్రభుత్వం హఠాత్తుగా యూటర్న్ తీసుకుంది. నిపుణులను అందిపుచ్చుకోవడానికి బ్రిటన్ ముందడుగు వేస్తున్నది. విదేశీ నిపుణుల కోసం కొన్ని వీసా ఫీజులను రద్దు చేయాలని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ యోచిస్తున్నారని ఫైనాన్షియల్ టైమ్స్ వార్తా కథనాన్ని ప్రచురించింది. దేశ ఆర్థిక స్థాయిని పెంచే సైంటిస్టులు, విద్యావేత్తలు, డిజిటల్ నిపుణులను ఆకర్షించేందుకు అనుసరించాల్సిన విధానాలపై ఇప్పటికే స్టార్మర్ ఆధ్వర్యంలో 'గ్లోబల్ టాలెంట్ టాస్క్ ఫోర్స్' చురుకుగా పనిచేస్తున్నదని తెలిపింది. ప్రపంచంలోని టాప్ 5 యూనివర్సిటీల్లో చదివిన వారిని, వ్యక్తిగతంగా ప్రతిష్టాత్మక బహుమతులను గెల్చుకున్న వారికి వీసా ఫీజును సున్నాకు తగ్గించాలని వీరు యోచిస్తున్నారు. దేశ ఆర్థిక వృద్ధిని పెంచే ప్రయత్నంలో ప్రపంచంలోని అత్యుత్తమ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, డిజిటల్ నిపుణులను ఆకర్షించే ఆలోచనలపై పనిచేస్తోందని, నెంబర్ 10 డౌన్‌టౌన్ స్ట్రీట్‌లో, ట్రెజరీ లోపల జరిగిన చర్చలపై వివరించిన వ్యక్తులను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది. 'విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు స్వదేశానికి రావాలి' విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు స్వదేశానికి రావాలంటూ పీఎంవో కార్యాలయం ముఖ్య అధికారి డాక్టర్ పీకే మిశ్రా పిలుపునిచ్చారు. 'కెపాసిటీ బిల్డింగ్ కమిషన్'లో భాగంగా ప్రతిభావంతులైన ప్రవాస భారతీయులను భారత్‌కు తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు.

**హెచ్-1బీ ఫీజు పెంపు నుంచి డాక్టర్లకు మినహాయింపు?**

**వైట్ హౌస్ ప్రతినిధి అంచనా**

ట్రంప్ ప్రభుత్వం తాజాగా పెంచిన హెచ్-1బీ వీసా ఫీజు నుంచి డాక్టర్లకు మినహాయింపు ఇచ్చే అవకాశం ఉన్నట్లు వైట్ హౌస్ సోమవారం వెల్లడించింది. గ్రామీణ అమెరికాలో ఇప్పటికే ఉన్న డాక్టర్ల కొరతను దృష్టిలో ఉంచుకుని దిగ్గజ వైద్య సంస్థలు వ్యక్తం చేసిన ఆందోళనను పురస్కరించుకుని ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు వైట్ హౌస్ అధికార ప్రతినిధి టేలర్ రోజెర్స్ బ్లూమ్‌బర్గ్ న్యూస్‌కి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవకులకు తీవ్ర కొరత ఉన్న కారణంగా దవాఖానలకు డాక్టర్ల నియామకాల కోసం హెచ్-1బీ ప్రోగ్రామ్ అత్యంత కీలకంగా మారింది. పెద్ద దవాఖానలు డాక్టర్లను, హెచ్-1బీ ప్రోగ్రామ్ ద్వారా స్పాన్సర్ చేస్తుంటాయి. తమ వైద్య శ్రామిక శక్తిలో అంతర్జాతీయ మెడికల్ గ్రాడ్యుయేట్లు కీలక భాగస్వాములని అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబీ తెలిపారు. డాక్టర్ల కొరత ఉన్నట్లు గుర్తించిన ప్రదేశాలలో 7.6 కోట్ల మందికి పైగా అమెరికన్ పౌరులు నివసిస్తున్నట్లు సమాచారం.

## ఈ సీజన్‌లో హెర్బల్ టీలను తాగడం మరిచిపోకండి.. ఇవి చేసే మేలు అంతా ఇంతా కాదు..



వర్షాకాలంలో సహజంగానే అందరికీ అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ దగ్గు, జలుబు, జ్వరం వంటి రోగాల బారిన పడుతుంటారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధులు త్వరగా అటాక్ అవుతుంటాయి. పైగా వారికి ఇవి ఒక పట్టాన తగ్గవు. కనుక రోగ నిరోధక శక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు గాను పలు హెర్బల్ టీలు మనకు ఎంతగానో ఉపయోగపడతాయి. వర్షాకాలంలో హెర్బల్ టీలను సేవించడం వల్ల ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఆయుర్వేద ప్రకారం ఈ టీ లు మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయి. జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తాయి. నీరు, గాలి, ఆహారం కాలుష్యం వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. అలాగే బద్ధకం నుంచి బయట పడవచ్చు. యాక్టివ్‌గా మారుతారు. ఉత్సాహంగా ఉంటారు. ఇక అందుకు ఏయే హెర్బల్ టీ లు ఎలా పనిచేస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

ఏయే టీలను తాగాలంటే..

అల్లం, తులసి చాలా మంది ఇళ్లలో ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. చిన్న అల్లం ముక్కను, కొన్ని తులసి ఆకులను కొన్ని నీళ్లలో వేసి మరిగించి వడకట్టి ఆ నీళ్లను గోరు వెచ్చగా ఉండగా తాగేయాలి. రుచి కోసం అందులో అవసరం అనుకుంటే కాస్త నిమ్మరసం, తేనెను కలపవచ్చు. పసుపు టీ కూడా మనకు ఎంతో మేలు చేస్తుంది. కొన్ని నీటిలో కొద్దిగా పసుపు, తురిమిన అల్లం, నల్ల మిరియాల పొడి వేసి బాగా మరిగించి అనంతరం ఆ నీళ్లను వడకట్టి గోరు వెచ్చగా ఉండగానే తాగేయాలి. అలాగే వాము గింజలు, సోంపు గింజలను నీటిలో వేసి మరిగించి తాగుతున్నా ఉపయోగం ఉంటుంది. లెమన్ గ్రాస్, కొన్ని పుదీనా ఆకులను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. దాల్చిన చెక్క పొడి లేదా ముక్కలను నీటిలో వేసి మరిగించి తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇలా పలు రకాల హెర్బల్ టీలను మీరు మీ ఇంట్లోనే తయారు చేసి తాగవచ్చు. వీటితో అనేక లాభాలను పొందవచ్చు.

రోగ నిరోధక వ్యవస్థకు..

హెర్బల్ టీలను ఇంట్లో తయారు చేసి తాగడం వల్ల శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. దగ్గు, జలుబు, జ్వరం నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం, తులసి, పసుపు వంటి పదార్థాల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మార్చి ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. హెర్బల్ టీలను సేవించడం వల్ల మెటబాలిజం మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. దీని వల్ల అజీర్తి తగ్గుతుంది. అల్లం, పుదీనా, వాము, సోంపు గింజల్లో ఉండే సమ్మేళనాలు కార్మినేటివ్ గుణాలను కలిగి ఉంటాయి. కనుక జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు తగ్గిపోతాయి. ఆకలి పెరుగుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది.

కీళ్ల నొప్పులు, వాపులకు..

హెర్బల్ టీలను సేవించడం వల్ల కీళ్ల నొప్పులు, వాపులు, ఒళ్లు నొప్పుల నుంచి బయట పడవచ్చు. శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. పసుపు, అల్లం, దాల్చిన చెక్కలలో శక్తివంతమైన యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి ఒళ్లు నొప్పులను తగ్గించి వాపుల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. హెర్బల్ టీలను సేవిస్తుంటే శరీరం డిటాక్స్ అవుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ముఖ్యంగా కిడ్నీలు, లివర్ క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. ఇందుకు లెమన్ గ్రాస్ టీ చక్కగా పనిచేస్తుంది. దీన్ని సేవిస్తుంటే లివర్, కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. హెర్బల్ టీలను సేవించడం వల్ల ఒత్తిడి, ఆందోళ సైతం తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. దీంతో రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. ఇలా వర్షాకాలంలో హెర్బల్ టీలను సేవించడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# బతుకమ్మపై సర్కారు శీతకన్ను



సోయిలేని కాంగ్రెస్ పాలనలో బతుకమ్మ తీరు మారింది. స్వరాష్ట్ర ఉద్యమానికి నేపథ్యంలా నిలిచిన ప్రజల పండుగ అయిన బతుకమ్మకు ఆదరణ కరువై కళ తప్పుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో తిరుగుబాటు బావుటాలా ఎగిసిన బతుకమ్మ, కేసీఆర్ పాలనలో కీర్తి బావుటాలా విలసిల్లిన బతుకమ్మ, కాంగ్రెస్ ఫ్యూడలా అని స్వరాష్ట్రంలో అనాదరణకు గురవుతున్నది. మార్పు పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు చిన్న గా చిన్న మార్పుతో మొదలుపెట్టి ఏకంగా తెలంగాణ తల్లినే మార్చే శారు. అమ్మ చేతిలో బతుకమ్మను మాయం చేశారు. ఇవీ తెలంగాణ తల్లి పట్ల, ఆ తల్లి గుండెల్లో నెలకొన్న బతుకమ్మ పట్ల వారికున్న భక్తిశ్రద్ధలు. ఇప్పుడు బతుకమ్మపైనే శీతకన్ను వేసి ప్రజల సెంటిమెంటుతో ఆటాడుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో బతుకమ్మ కష్టాలు అన్నీఇన్నీ కావు. సంబురాలు జరిపేందుకు పంచాయతీలకు ఇచ్చే నిధులకు మొం డిచేయి చూపించింది సర్కారు. బతుకమ్మ అంటేనే గుర్తొచ్చే చీరల పంపిణీకి రెండో ఏడాదీ ఎగనామం పెట్టింది. 60 లక్షల మందికి ఒక్కొక్కరికి ఒకటి కాదు, రెండు ఇస్తాం.. 1.2 కోట్ల చీరలు పంపిణీ చేస్తామని ఊరించిన సర్కారు చివరకు ఒక్కటీ ఇవ్వకుండా చేతులెత్తేసింది. ఆడపడుచు ల ఆశలపై నీళ్లు గుమ్మరించింది. అటు కాంగ్రెస్ మార్కు కరెంటు కష్టాలతో సద్దుల బతుకమ్మకు కూడా సెల్‌ఫోన్ వెలుగులే దిక్కయ్యాయి. బతుకమ్మను రాష్ట్ర ఉత్సవంగా గుర్తించేందుకూ కాంగ్రెస్ సర్కారుకు మనసు రాలేదు. ప్రజల పండుగ అంటున్నారు మరి ప్రజలే జరుపుకోవాలి అన్నట్లుగా చేతులు ముడుచుకుని కూర్చున్నది. హైదరాబాద్‌లో ఘనంగా పండుగ జరుపుకొనే సంప్రదాయాన్ని అటకెక్కించింది. పండుగ సందర్భంగా గుర్తుండుకునే గొప్ప కార్యక్రమం ఏదీ సర్కారు చేపట్టకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించింది. నగర కూడళ్లలో కళావిహీనమైన రబ్బరు ట్యూబుల బతుకమ్మలు పేర్చి తన కళాపోషణను చాటుకున్నది. నగర వీధులను హోరెత్తించే బతుకమ్మను సరూర్‌నగర్ స్టేడియంలోకే నెట్టేసి ఇంటే సంగతులు అనిపించింది. ఓ వెయ్యిమంది అక్కడ బతుకమ్మ ఆడితే ఇదే ప్రపంచ రికార్డు అని టాంటాం వేసుకుంటున్నది. ఆ మాత్రానికే మురిసిపోతే ఎలా? హనుమకొండ వేయిస్తంభాల గుడి, పద్మాక్షి గుట్ట, కరీంనగర్ సర్కస్ గ్రౌండ్, మానేరు తీరం, సిద్దిపేట కోమటిచెరువు గట్టున జరిగిన బతుకమ్మల్లో వేలాది మహిళలు పాల్గొన్న బతుకమ్మల రికార్డు ఎక్కడికి పోవాలి? ఉద్యమకాలంలో, స్వరాష్ట్ర సాధన తర్వాత నెక్లెస్ రోడ్డును అలంకరించిన బతుకమ్మ ఏమైపోవాలి? పండుగ గురించి సర్కారు పెద్దలు, పాలకపక్షీయులు చేసిన వ్యాఖ్యలు కొన్ని గందరగోళానికి దారితీస్తే మరికొందరు ఒక్కొక్కరు ఒక్కో రకం పేర్లతో నవ్వు తెప్పించారు. ఒకరు ఇది గిరిజనుల పండుగ అని సెలవిస్తే భాష్యం చెప్పారు. మరొకరు జానపద నృత్యమని రాగాలు తీశారు. అసలు బతుకమ్మ ఆత్మను మాత్రం కాంగ్రెస్ సర్కారు పట్టుకోలేదు, ఆ మాటకు వస్తే పట్టించుకోలేదు. 'జై తెలంగాణ' అనేందుకు నోరు రాని ముఖ్యమంత్రి, 'సబ్బు' బతుకమ్మకు, సద్దుల బతుకమ్మకు తేడా తెలియని మంత్రుల పరిపాలనలో బతుకమ్మ ఆగమాగం కాక ఏమవుతుంది? తల్లి తెలంగాణ నగలు వలిచినోళ్లు బతుకమ్మను నిరాదరణకు గురిచేయడంలో ఆశ్చర్యం ఏముంది? అందుకే బతుకమ్మ వేదికలు సర్కారు వ్యతిరేక నినాదాలతో ప్రతిధ్వనించాయి.

## రాత్రిపూట ఈ లక్షణాలు కనిపిస్తే యమడేంజర్.. మీ కిడ్నీలను కాపాడుకోండి..





శరీరంలోని ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి.. ఇది శరీరం నుండి మలినాలను తొలగించడానికి పనిచేస్తుంది. కిడ్నీలు లేకుండా శరీరం పనిచేయడం కష్టం. కిడ్నీ వైఫల్యానికి ముందే, మన శరీరం సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. రాత్రి నిద్రపోతున్నప్పుడు కనిపించే ఈ లక్షణాలను విస్మరించకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ´రీరంలోని అతి ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు (కిడ్నీలు) ఒకటి.. కిడ్నీలు శరీరం నుంచి మలినాలను తొలగించడానికి పనిచేస్తాయి.. మూత్రపిండాలు లేకుండా, శరీరం పనిచేయడం కష్టం. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, అనేక తీవ్రమైన వ్యాధులు వస్తాయి.. అందుకే మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం అవసరం. మూత్రపిండాల వైఫల్యానికి ముందే, మన శరీరం సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. అయితే.. కిడ్నీ వ్యాధులకు సంబంధించి రాత్రిపూట కొన్ని సంకేతాలు కనిపిస్తాయని.. వాటిని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయొద్దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మూత్రపిండాల దెబ్బతిన్నప్పుడు.. రాత్రి వేళ కనిపించే లక్షణాలేంటో తెలుసుకోండి..**


రాత్రిపూట తరచూ మూత్ర విసర్జన: మూత్ర విసర్జన శరీరం సాధారణ పని.. కానీ రాత్రిపూట అధికంగా మూత్ర విసర్జన చేయడం మూత్రపిండాల వైఫల్యానికి సంకేతం. మూత్రపిండాలలో ఏదైనా సమస్య మొదట మూత్రం ఏర్పడటాన్ని ప్రభావితం చేస్తుంది. మీరు నిద్రలో కూడా మూత్ర విసర్జన చేస్తుంటే.. ఈ లక్షణాన్ని విస్మరించవద్దు. అధికంగా చెమటలు: వేసవిలో అందరికీ చెమటలు పడతాయి, కానీ రాత్రిపూట అధిక చెమటలు పట్టడం మూత్రపిండాల వైఫల్యానికి హెచ్చరిక సంకేతం కావచ్చు. దీనివల్ల శరీరంలో క్రియాటినిన్ స్థాయిలు పెరుగుతాయి.. తీవ్రమైన రక్తపోటు: అధిక రక్తపోటు మూత్రపిండాలు దెబ్బతిన్నాయనడానికి సంకేతం కావచ్చు. మూత్రపిండాలలో లోపం ఉన్నప్పుడు, అవి క్రియేటినిన్‌ను ఫిల్టర్ చేయలేవు, అటువంటి పరిస్థితిలో, క్రియేటినిన్ రక్త నాళాలలో పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. ఇది రక్త నాళాలను విస్తరిస్తుంది.. అంతేకాకుండా.. ఇది రక్త ప్రసరణను ప్రభావితం చేసి.. రక్తపోటును పెంచుతుంది. వాంతులు వికారం: వాంతులు కూడా మూత్రపిండాల వైఫల్యానికి సంకేతం. రాత్రి భోజనం తర్వాత మీరు తరచుగా వాంతులు చేసుకుంటే లేదా వికారం అనిపిస్తే, అది మూత్రపిండాలు దెబ్బతిన్నాయనడానికి సంకేతం. అటువంటి లక్షణాలను విస్మరించడం ప్రమాదకరం. పాదాల నొప్పి: ఎటువంటి కారణం లేకుండా మీ పాదాలలో నొప్పి ఉంటే, అది సాధారణం కాదు. శరీరంలో క్రియాటినిన్ స్థాయి పెరిగినప్పుడు, పాదాల నొప్పి సమస్య తలెత్తుతుంది. ఎందుకంటే పాదాలలో క్రియాటినిన్ పెరిగిన మొత్తం పేరుకుపోతుంది. కావున ఈ లక్షణాలను అస్సలు విస్మరించవద్దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీకు ఏమైనా సమస్యలుంటే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స పొందండి..

## వామ్మో ఈ పువ్వులో ఉన్న రహస్యం తెలిస్తే అస్సలు వదలరు..! ఇది నిజం



ఈ మసాలా చర్మాన్ని ప్రకాశవంతంగా, ఆరోగ్యంగా మార్చడంలో సహాయపడుతుంది. ఈ మసాలా నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. స్టార్ సోంపును సాంప్రదాయకంగా దగ్గు, జలుబు, ఉబ్బసం వంటి శ్వాసకోశ సమస్యలకు చికిత్స చేయడానికి ఉపయోగిస్తారు. స్టార్ పువ్వు రెగ్యులర్ డైట్ లో చేర్చుకోవడం వల్ల పుష్కల పోషకాలు ఉంటాయి. శరీరానికి మేలు చేస్తాయి. స్టార్ అనైజ్ డైట్‌లో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం.. ఈ భారతీయ మసాలా దినుసు ఆరోగ్య ప్రయోజనాలు మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇది వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. స్టార్ సోంపు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అపానవాయువు, మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. స్టార్ సోంపును సాంప్రదాయకంగా దగ్గు, జలుబు, ఉబ్బసం వంటి శ్వాసకోశ సమస్యలకు చికిత్స చేయడానికి ఉపయోగిస్తారు. స్టార్ పువ్వు రెగ్యులర్ డైట్ లో చేర్చుకోవడం వల్ల పుష్కల పోషకాలు ఉంటాయి. శరీరానికి మేలు చేస్తాయి. స్టార్ అనైజ్ డైట్‌లో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం.. స్టార్ సోంపులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఈ మసాలా బాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. స్టార్ సోంపులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి బ్యాక్టీరియా, వైరస్‌లను తొలగించడంలో సహాయపడతాయి. ఇందులో యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. అంటే ఇది ముఖ్యంగా జలుబు, రొంప సమస్యలకు మంచి ఔషధం అని చెప్పాలి. దీంతో సహజసిద్ధంగా ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తుంది. ఈ మసాలా చర్మాన్ని ప్రకాశవంతంగా, ఆరోగ్యంగా మార్చడంలో సహాయపడుతుంది. ఈ మసాలా నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఈ మసాలా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. స్టార్ అనైజ్ షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. రక్తంలో చక్కెర స్థాయిలను హఠాత్తుగా పెరగనివ్వకుండా కాపాడుతుంది. షుగర్ బాధితుల్లో మెటబాలిజం రేటు పెంచుతుంది. స్టార్ అనైజ్ షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. రక్తంలో చక్కెర స్థాయిలను హఠాత్తుగా పెరగనివ్వకుండా కాపాడుతుంది. షుగర్ బాధితుల్లో మెటబాలిజం రేటు పెంచుతుంది.

# బువ్వ



'నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2025'లో ప్రత్యేక బహుమతి రూ.5 వేలు పొందిన కథ. కుమారస్వామికి నిద్ర పట్టలేదు. పదేపదే వైకుంఠప్ప అన్న మాటలే గుర్తుకొస్తున్నాయి. అతను పడే వేదనలో అర్థముంది. కడుపునిండా తిని, కంటి నిండా నిద్రపోయే వాళ్లకు ఈ విధమైన ఆలోచనలు ఉండవు. వైకుంఠప్ప పనికి వచ్చినా రాకపోయినా.. అతను లేవనెత్తిన అంశమైతే తీసివేయదగ్గది కాదు. పనోడు చెప్పినా, మనోడు చెప్పినా.. హితకరమైనదైతే వినాలి, ఆచరించాలి. కొందరు మహానుభావులతోపాటు ప్రకృతిలో ఉన్న చెట్టూ-చేమ, పురుగూ-పుట్రల్ని చూసి మనిషి తనను తాను చాలా మార్చుకున్నాడు. రాత్రి పన్నెండు గంటలు దాటింది. తాగునీళ్ల కోసం అటుగా వచ్చిన కుమారస్వామి కొడుకు మిథున్.. అమ్మానాన్నల గదిలో ఇంకా లైటు వెలుగుతుండటం చూసి, చిన్న అనుమానంతో..

**"అమ్మా.. నాన్నా!" అంటూ తలుపు తట్టాడు.**

**కుమారస్వామి భార్య రేణుకకు అప్పుడప్పుడే నిద్ర పట్టింది. తలుపు కొడుతున్న చప్పుడు వినబడేసరికి**

**లేవబోయింది.**

**"నేను వెళ్తాలే.. నువ్వు పడుకో" అని శ్రీమతిని వారించిన కుమారస్వామి, వెళ్లి తలుపు తీశాడు.**

**ఎదురుగా మిథున్ నిలబడి ఉన్నాడు.**

**"ఏంటి నాన్నా! రోజూ పది గంటలలోపే నిద్రపోయేవారు. ఇంతవరకు మేలుకున్నారేంటి? ఏమైనా హెల్త్ ప్రాబ్లమా!" అన్నాడు.**

**"అదేం లేదు చిన్నా! పట్టించుకుంటే పెద్దది, చూడనట్టు వదిలేస్తే చిన్న సమస్య. కానీ విలువైనది" అన్నాడు కుమారస్వామి.**

**"వావ్ ఇంట్రెస్టింగ్! ఏమిటది?" తెలుసుకోవాలన్న ఉత్సుకతతో అడిగాడు మిథున్.**

"ఇప్పటికిప్పుడు తొలగిపోయేది కాదులేరా. బాగా పొద్దుపోయింది. రేపు పొద్దున్నే చెప్తాను. అయినా.. నువ్వింకా నిద్ర పోలేదా" అన్నాడు కొడుకుని. "కెనడాలో ఉన్న సాయికిరణ్ చాన్నాళ్ల తర్వాత ఫోన్ చేశాడు నాన్నా. వాడితో మాట్లాడుతుంటే ఇంతసేపయింది. సరే నాన్నా.. నేను వెళ్తాను. గుడ్ నైట్!" అంటూ తన గదివైపు వెళ్లాడు మిథున్. మిథున్ బెంగళూరులో పేరుగాంచిన ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఉద్యోగంలో చేరి రెండేళ్లు అయింది. దూర ప్రాంతాల్లో జాబ్ ఆఫర్స్ వచ్చినా వెళ్లలేదు. భవిష్యత్తులో విదేశాలకు వెళ్లే ఆలోచన అస్సలు లేదు. జీతం తక్కువైనా సొంత ఊరికి దగ్గరగా ఉంటున్నాడు. అమ్మానాన్నలంటే అతనికి పిచ్చి ప్రేమ. ఉన్న ఏకైక సంతానంపై రెండు ప్రాణాలు పెట్టుకున్న కొండంత ప్రేమకు ప్రతిరూపం మిథున్. కొడుకు ఒక్కవారం ఇంటికి రాకపోయినా విలవిల్లాడుతారు కుమారస్వామి-రేణుక. సాధారణంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నవారు వారానికి ఐదు రోజులు కంప్యూటర్ ముందు కష్టపడి.. వారాంతంలో పూర్తిగా రెస్ట్ తీసుకొంటుంటారు. లేకుంటే మనసుకు ఆహ్లాదం కలిగించే ప్రకృతి యాత్రలు చేస్తుంటారు. మిథున్ అలా కాదు. కొంచెం డిఫరెంట్‌గా ఆలోచిస్తాడు. మంచి సబ్జెక్టు దొరికితే ఫ్రెండ్స్‌తో కలిసి వాటికి తగ్గ లొకేషన్స్ వెతుక్కుని సందేశాత్మకమైన షార్ట్ ఫిల్మ్స్ తీస్తుంటాడు. నేషనల్ లెవెల్లో కొన్నిటికి అవార్డ్స్ కూడా వచ్చాయి. ఒకరకంగా పని రాక్షసుడు అనవచ్చు. ఈసారి వారాంతంతోపాటు సోమవారం పండగసెలవు రావడంతో ఇంటికి వచ్చాడు. కుమారస్వామి ఉదయం ఆరుగంటలకు వాకింగ్‌కు వెళ్తాడు. చాలా ఏళ్లుగా అది అతని దిన చర్య. మిథున్ ఇంట్లోనే ఎక్సర్‌సైజ్ చేస్తాడు. లేదా తన షెడ్యూల్‌ను బట్టి బయటికి వెళ్తాడు. ఆరోజు తండ్రి వెంట వాకింగ్‌కు వెళ్లాలనుకుని ముందే రెడీ అయి కూర్చున్నాడు.

**వాళ్ల నాన్న రాగానే..**

**"నేనూ మీతో వస్తా నాన్నా" అన్నాడు.**

**"ఎప్పుడూ రానిది ఇప్పుడేమిట్రా! ఓకే!" అన్నాడు మిథున్ వీపు తడుతూ.**

"నాన్నా.. మీరు రోజూ వెళ్లే జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌కు కాకుండా చెరువు కట్టవైపు వెళ్దాం. చాలా కాలమైంది అటువైపు వెళ్లి" అన్నాడు.

కొడుకుతో కలిసి వాకింగ్ చేస్తుంటే.. ఆరోజు ఎందుకో కొత్తగా ఉంది కుమారస్వామికి. తండ్రితో కలిసి నడుస్తున్నందుకు మిథున్ కూడా అదే అనుభూతికి లోనవుతున్నాడు. ఇద్దరూ చెరువుకట్టను సమీపించారు. చెరువులో మట్టితోడి రెండు ట్రాక్టర్లలో వేస్తున్న నలుగురు కూలీలు తప్ప.. నరసంచారం ఏదీ లేదక్కడ. రకరకాల చెట్లున్న కొండ వైపునుంచి వస్తున్న చల్లటి గాలి, జంట గుట్టల మధ్య లేస్తున్న సూర్యుని వెచ్చటి కిరణాలతో మనసును పులకింపజేసే వాతావరణం ఉందక్కడ. "ఇప్పుడు చెప్పండి నాన్నా! రాత్రి మీ నిద్రలేమికి కారణం ఏంటి?" అన్నాడు మిథున్.. శిథిలావస్థలో ఉన్న తూమువైపు చూస్తూ. "చిన్నా! కర్నాటక సరిహద్దులో ఉన్న ఈ ఊరు.. చుట్టుపక్కల ఇరవై గ్రామాలకు మండల కేంద్రంగా ఉన్నా, పెద్దగా ఎదుగూబొదుగు లేకుండా నిలిచిపోయింది. ఇప్పుడు మన క్లాత్ షోరూమ్‌కు ఎదురుగా మొన్నటిదాకా ఒకపెద్ద వేపచెట్టు ఉండేది. దానికింద మా నాన్న రెండు కుక్కి మంచాలు వేసుకొని బట్టల వ్యాపారం చేసేవాడు. ఆయన దగ్గరే నేను వ్యాపారానికి సంబంధించిన కొన్ని కిటుకులు నేర్చుకున్నాను. మా నాన్న ఉన్నట్లే నేను మన షోరూం ఉన్న స్థలం కొన్నాను. ఆయన చనిపోయిన పదేళ్లదాకా నాకు షాపు కట్టడానికి కావలసిన డబ్బు సమకూరలేదు. వ్యాపారం అంత మందకొడిగా సాగేది. షోరూం కట్టిన ఐదేళ్ల తర్వాత కొంత సొమ్ము మిగిలొచ్చింది. ఎవరో అవసరానికి అగ్గువగా అమ్ముతున్నారని తెలిసి ఊరి బయట ఎకరం స్థలంకొన్నాను. బెంగళూరు నగరం దగ్గర ఉన్న పుణ్యమేమో! ఈ నాలుగైదేళ్లుగా చుట్టుపక్కల చిన్నాపెద్దా ఫ్యాక్టరీలు పడుతుండటం వల్ల.. ఈ ప్రాంతం అభివృద్ధిలో కదలిక మొదలైంది. జనసంచారం బాగా పెరిగింది. రోడ్ల వెడల్పులో భాగంగా మన షాపు ఎదురుగా ఉన్న వేపచెట్టును కొట్టేశారు. అప్పుడు మా నాన్న ఇంకోసారి చనిపోయిన బాధ కలిగినా.. 'ఇప్పుడు బట్టల వ్యాపారం బాగా సాగుతోంది. అభివృద్ధి ఊపందుకుంది కదా!' అని సంతోషించాను. ఈ ఊర్లో శు భకార్యాలు చేయడానికి అనువైన ఫంక్షన్ హాలు ఒకటీ లేదు. కోట లోపల రెండు హాళ్లు ఉన్నా.. అవి ఇప్పుడు చాలా పాతబడ్డాయి. ఎక్కువమంది అతిథులు వస్తే అకామిడేషన్, పార్కింగ్ సౌకర్యం కూడా లేదు. అందరూ దూర ప్రాంతాల్లోని మండపాలను బుక్ చేసుకొని వెళ్తున్నారు. అందుకే ఊరి బయట ఉన్న మన ఎకరా స్థలంలో కల్యాణ మండపం కట్టాలని నిశ్చయించుకున్నాను. తర్వాత పనులు ఎలా చకచకా జరిగాయో, మన నియోజకవర్గ ఎమ్మెల్యే గారి చేతులమీదుగా ఎలా ప్రారంభోత్సవం జరిగిందో, ఆ మరుసటి రోజునుంచే మన మండపం ఎలా ప్రజాదరణకు నోచుకుందో నీకు తెలుసు. కల్యాణమండపం అంటే మాటలా.. వంటవాళ్లు, డెకరేషన్ చేసేవాళ్లు, శుభకార్యాలు జరిగినప్పుడు పని చేసేవాళ్లు అందుబాటులో ఉండాలి. అవన్నీ సమకూర్చుకోగలిగాను గానీ రెగ్యులర్‌గా మండపం దగ్గర ఉంటూ పనిచేసే వాళ్లను వెతుక్కోలేక పోయాను. ఈ విషయం మనకు రోజూ పాలు పోసే బసంపల్లి రాంరెడ్డికి చెప్పాను. అతను వైకుంఠప్ప-నారాయణమ్మ అనే అరవై ఏళ్లు పైబడిన దంపతుల్ని పిలుచుకొని.. మన షాపు దగ్గరికి వచ్చి పరిచయం చేశాడు. 'అన్నా! నాకు బుద్ధొచ్చినప్పటి నుంచి గమనిస్తున్నాను. వీళ్లు మా ఊరి పొలాల్లో దినకూలీలుగా పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. పాపం పిల్లోళ్లు పుట్టలేదు. ఒకరికి ఒకరు.. వాళ్లే పిల్లోళ్లు. మా ఊరు పొలాలు తప్ప బయట ప్రపంచం వీళ్లకు అంతగా తెలీదు. కూలీకి పిలిచిన యజమాని చేనులో ఉన్నా లేకున్నా శ్రద్ధగా పనిచేస్తారు. ఊర్లో వీళ్లకు ఆస్తి పాస్తులు ఏమీ లేవు. ఉంటున్న గుడిసె కూడా కూలిపోయే స్థితిలో ఉంది. మా ఊరి వాళ్లకు ఇప్పటి నుంచీ వీళ్లు లేని లోటైతే పూడ్చలేనిదే. అయితే గాలికి, ఎండకి కొట్టుకొని ఎన్నాళ్లని పనిచేస్తారు. ముసలి ముప్పున అయినా నీడ పాటున

**ఉంటారని ఒప్పించి తీసుకొచ్చాను' అన్నాడు.**

నేను వాళ్లకు మండపం పక్కన కట్టిన రెండు గదుల ఇంటిని చూపించి అందులో ఉండమని చెప్పాను. వాళ్లు నిత్యం చేయాల్సిన పనులు వరుసగా చెప్పి.. 'ఇద్దరికీ కలిపి నెలకు పదివేలు జీతం ఇస్తాను. ఫంక్షన్లు చేసుకునే వాళ్లుకూడా అంతో ఇంతో ఇచ్చిపోతారు. ఇంకా ఏమైనా అవసరమైతే మొహమాటం లేకుండా నన్ను అడగండి' అని చెప్పాను. కొత్త కల్యాణ మండపం సకల సౌకర్యాలతో ఆకర్షణీయంగా ఉంది. ముహూర్తాలు లేనిరోజులు మినహా.. నెలలో ఇరవై రోజులు మండపం సందడిగా ఉంటోంది. వైకుంఠప్ప దంపతులు సొంత ఇంటిలా మండపాన్ని చూసుకుంటున్నారు. ఇట్లా ఒక నెల దినాలు గడిచాయి. ముప్పై ఒకటో దినం వైకుంఠప్ప వచ్చి మండపం తాళం చెవులు నా చేతిలో పెట్టి, కారణం చెప్పకుండా.. 'మేము ఇక్కడ ఉండలేము సారూ..' అని జీతం కూడా అడక్కుండా భార్యను పిలుచుకొని వాళ్ల ఊరికి వెళ్లిపోయాడు. నాకు ఏమీ పాలు పోలేదు. లోపం నాలో అయితేలేదు. మరెక్కడుంది? అసలేమి జరిగింది? ఏదైనా కనుక్కోవాలని రాంరెడ్డిని వెంటపెట్టుకొని వైకుంఠప్ప ఇంటికి పోయాను.

**అప్పుడు వైకుంఠప్ప అన్న మాటలే నన్ను రాత్రి నిద్రకు దూరం చేశాయి"..**

**ఆసక్తికరంగా సాగుతున్న కుమారస్వామి మాటలు అక్కడ ఆగిపోయాయి.**

**వాకింగ్ చేస్తున్న అతను ఒక చెట్టు కింద నిలబడిపోయాడు.**

**"ఏమైంది నాన్నా. ఏం మాటలవి?" నిలబడి ఉన్నచోట పైనుంచి పండుటాకులు రాలుతుండగా అడిగాడు మిథున్.**

**మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు కుమారస్వామి..**

"నేను మీపై నమ్మకంతో ఏదో ఈ వయసులో మీకు సులకాగ ఉండే పని కల్పిద్దామని ఈ పూరిగుడిసెకు దూరంగా మంచి ఇల్లు ఇప్పించి పని చూపిస్తే.. ఏంది వైకుంఠప్పా! నాకు చెడ్డ పేరువచ్చేలా ఇట్లా చేస్తిరి మీరు" విచారంగా అన్నాడు రాంరెడ్డి.

**"అయ్యా! మీరు దయ చూపించినదైతే నిజమే! మీ రుణం తేర్చుకోలేనిదే! కానీ, మాకు అక్కడ ఉండటానికి మనసొప్పడం లేదు"..**

లోలోన నలుగుతున్నట్లుగా అన్నాడు వైకుంఠప్ప. "ఏమి వైకుంఠప్పా! ఒంటరిగా ఏమైనా ఉండమన్నామా! ఆలుమగలు ఇద్దరూ కలిసేకదా ఆడన ఉన్నారు. అడవిలో ఏమైనా ఇడిచిపెట్టినామా!? మనుషుల మధ్యనే కదా ఉండమన్నాము. ఏమీ తోచకపోతే ఊర్లోకి కూడా అట్లా పోయి సినిమానో గినిమానో చూసిరావచ్చు కదా! ఈ ఊర్లో మీకు ఏమి ఆస్తులు ఉన్నాయని బెంగపెట్టుకుని ఎనక్కి వచ్చినారు? ఆ ఏరియాలో దెయ్యాలు ఏమైనా కనిపించినాయా? ల్యాక ఎవరైనా బెదిరించినారా?" కాస్త దురుసుగానే అన్నాడు రాంరెడ్డి. "మా బాధ అది కాదయ్యా! ఈ నెల దినాల్లో శానా ఫంక్షన్లు జరిగినాయి. మాకు మూడు పూటలా తిండి గడిచింది. అంతో ఇంతో దుడ్లు కూడా ఇచ్చినారు. లోటు చేశారని లొట్టకూతలు కూయకూడదు. ఈ ముసలి ప్రాణాలకు దెయ్యాలు, మనుసులతో యా భయమూ లేదు. మేము గాదిరాకు, బలుసాకు తినిపించిన కరువు కాలం నుంచీ ఈ భూమిపైన ఉంటాన్నాము. సంగతి కడికి దిక్కులేక కావుకావుమని కాకుల్లా అరిచినాము. బువ్వ లేనప్పుడు బావినీళ్లు తాగి బోర్లా పడుకున్నాం. నీళ్లు లేక ఎండిన చెరువుల్ని చూసినాము. చేన్లనూ చూసినాము. ఇప్పుడేదో కాలం మారిపోయి కూలికి పోయినా, పోకపోయినా.. గవర్నమెంటు స్టోరు బియ్యం వొనగూడి ఉపాసమైతే ఉంటలేము"..

**వైకుంఠప్ప ఏదో విడమరిచి చెబుతున్నాడని, కుమారస్వామి, రాంరెడ్డి ఇద్దరూ చెవులొగ్గి వింటున్నారు.**

"నీకు తెలీదా రాంరెడ్డీ! ఒక ధాన్యం గింజ పండించడానికి కూలీలు ఎంత కష్టపడతారో! రైతులు ఎన్ని నిద్రలేని రాత్రులు గడుపుతారో! ఎన్ని గాయాలు తగిలించుకుని ప్రాణాలు అడ్డుగా పెడతారో! ఒగొగ గింజా ఏకమైతేనే కదప్పా పిడస బువ్వ అయ్యేది. బువ్వంటే ఎంత అపురూపం. బువ్వే కదా.. మనుసుల ప్రాణాలు నిలిపేది. బువ్వనే కదా మనం పూజించాల్సింది. పదిమందికీ పెట్టి సంతృప్తి పడేది. అట్లాంటి బువ్వను ఏందయ్యా.. ఆ మండపంలో పెళ్లిళ్లకి పేరంటాలకి వొచ్చిన సుట్టాలు, పట్టాలు ఏందో కాలితో తన్నినట్లు అట్లా వృథా చేస్తాన్నారు? అంతంత బువ్వ పెట్టించుకోవడం యాలనో, పారేయడం యాలనో! అదేమీ కడుపుమంటో! పెట్టినోడు నాశనమై పోనీ అన్నట్లు ఉంటాంది వాళ్ల వాలకం. పాడు కడుపు ఒక పూట తిన్నా ఉంటుంది. తినకున్నా తట్టుకుంటుంది. ఒకపక్క 'బీపీ ఉంది. సుగరు వ్యాధి ఉంది' అంటుంటారు. ఇంకోపక్క ప్లేటు నిండుగా బువ్వ పెట్టించుకుని పారేస్తుంటారు. ఒకపూట కడుపు నింపడానికి కార్యాలు చేసేవాళ్లు అన్నన్ని రకాల తిండి పదార్థాలు పెట్టడం అవసరమా చెప్పు! పల్లెల్లో అయితే తట్టల్లో మిగిలింది కుడితికి పోస్తే జీవాలు తిని తాగుతాయి. యక్కడా మెతుకు పక్కకి పోదు. ఎవరూ తినకుండా నేలపాలు చేసేది ఏందయ్యా!? దీనివల్ల డబ్బులు పెట్టినోడు బాగు పడినట్లనా, పారేసినోడు బాగుపడినట్లనా?"..

**మనసులోని బాధ మాటల ద్వారా బహిర్గతమవుతున్నా.. ఇంకా దేన్నో భరిస్తున్నట్టు చెప్పాడు వైకుంఠప్ప.**

**వైకుంఠప్ప ఆవేదనలో అర్థం ఉంది. కుమారస్వామి ఆలోచనలో పడ్డాడు.**

"పెద్ద మండపాల్లో శుభకార్యాలు చేస్తున్నారంటేనే.. వాళ్లు రవంత కలిగినోల్లని తెలుసుకోవాల! నీ జీతం నువ్వు తీసుకొని గమ్మనుండల! అంతేగానీ వాళ్లు ఏమి తింటేనేమి? ఏమి పారేస్తేనేమి? ఐటమ్లు తగ్గిస్తే.. 'పీనాసి నాకొడుకు ఏమీ పెట్టలేదు' అంటారు. దండిగా ఆకు నిండా నింపితే.. 'వానికేం తక్కువ! పెట్టనీలే' అంటారు. దేనికని ఓర్చుకునేది. పూర్వానికి పెద్దవాళ్లు చెప్పినారుకదా.. పెట్టి, పోసి గొప్పవాళ్లు అనిపించుకోలేమని! అయినా తప్పదుకదా.. పడితీరల కాలానికి తగ్గట్టు మారిపోవాల!" అన్నాడు రాంరెడ్డి.. వైకుంఠప్పతో. "మేము ఏందైనా ఓర్చుకుంటాము గానీ.. బువ్వ పారేస్తే సహించలేమయ్యా! అందుకే ఆ బిల్డింగులో కన్నా మా గుడిసెనే బాగుందని వచ్చేసినాము". ఎఆ మాటలకు.. ఎ"ఓర్నీ! మీరెక్కడి తెల్లబట్ట మనుసులయ్యా!" అనే ఒక్కమాట అని, నాలుక తడారిపోయినట్టు ఊరుకున్నాడు రాంరెడ్డి. కుమారస్వామికి తలసుడిలో వెంట్రుకలు గిర్రునతిరిగినాయి.

**"ఇంకేమీ మాట్లాడొద్దు! రాంరెడ్డీ పోదాం పదా!?" అని అక్కడినుంచి వచ్చేసినారు.**

"మనం నాగరికలమని చెప్పుకొంటున్నాం గానీ.. అసలైన నాగరికం వాళ్లను చూసే నేర్చుకోవాలి. నాకు కళ్లలో నీళ్లు తిరిగినాయి. వాళ్లు ఎలాగూ రారు. బలవంతం బాధ్యత ముందు పనిచేయదు. అయితే సమస్యమాత్రం పరిష్కారం కావాల!" అంటున్న కుమారస్వామి.. తండ్రి మాటలు వింటున్న మిథున్ కళ్లలోనూ నీళ్లు తిరిగాయి.

**అనుకోకుండా కడుపుని అరచేత్తో తడిమి చూసుకున్నాడు.**

ఇంటికి పోయి స్నానం చేసి అమ్మ పెట్టిన టిఫిన్ తింటున్నప్పుడు కూడా వైకుంఠప్ప మాటలే గుర్తుకొస్తున్నాయి మిథున్‌కు. ఎప్పుడూ ఎంతో కొంత ఆహారం ప్లేట్లో వదిలేసే అలవాటున్న అతను.. ఈరోజు కొంచమే వడ్డించుకుని పూర్తిగా తినేశాడు. వాళ్ల అమ్మ ఆశ్చర్యంగా చూసింది. కుమారస్వామి ఇది గమనించాడు.

**మిథున్ ఆదివారం రాత్రి బయలుదేరి బెంగళూరులోని ఆఫీసుకు వెళ్లాలి. కానీ వారం రోజులు సెలవు పెట్టినాడు.**

**"సెలవు ఎందుకు పెట్టావురా!?" అని నాన్న అడిగితే.. తర్వాత చెప్తానన్నాడు.**

**ఎక్కడికో వెళ్తున్నాడు వస్తున్నాడు.**

ఐదు రోజుల తర్వాత పది నిమిషాల నిడివి గల ఒక వీడియోతో కుమారస్వామి ముందునిలిచాడు మిథున్. దాన్ని చూస్తున్నంత సేపూ వైకుంఠప్పే కనిపించాడు కుమార స్వామికి. ప్రపంచంలో ఎంతోమంది ఒక్కపూట ఆహారం దొరక్క అలమటిస్తున్నారు. బువ్వ కోసమే చాలా సంసారాలు తట్ట బుట్ట నెత్తినెత్తుకొని వందల మైళ్లు వలసబోతున్నాయి. కానీ తావలో కావలి కాస్తున్నాయి. ధాన్యం పండించడానికి రైతులు, రైతు కూలీలు రేయింబవళ్లు వాతావరణ మార్పులకు తట్టుకుంటూ ఎలా కష్టపడతారో.. హృదయ విదారకంగా వివరణాత్మకంగా ఉందా వీడియోలో. చివర్లో.. 'మండపంలో మిగిలిన ఆహారం వృద్ధాశ్రమాలకు, అనాథాశ్రమాలకు పంపిస్తాం! దయచేసి ఆహారం వృథా చేయకండి' అనే విన్నపాన్ని జతచేశారు.

"నాన్నా! దీన్ని మన కల్యాణమండపం డైనింగ్ హాల్‌లో అందరికీకనిపించేలా ప్రొజెక్టర్ ద్వారా టిఫిన్లు, భోజన సమయాల్లో ప్రసారం చేద్దాం. దీన్ని చూశాక కూడా మారనివాళ్లను మూరు?లని కచ్చితంగా చెప్పొచ్చు. మార్పు వస్తుందనే ఆశిద్దాం. దీనికి ఏర్పాట్లు చేస్తాను. అలాగే నీటి ప్రాముఖ్యతను తెలిపే ఫ్లెక్సీలను అవసరమైన చోట ఏర్పాటు చేద్దాం. భోజనాలు వడ్డించే వారికి కూడా మితంగా వడ్డించమని గుర్తుచేసే బాధ్యత కూడా మనమే తీసుకుందాం. దీనివల్ల అటు వినియోగదారులకూ మేలు చేసినట్లు అవుతుంది. మన మండపం పట్ల సదభిప్రాయం కూడా కలుగుతుంది" అన్నాడు మిథున్.

**కొడుకును మనసారా అభినందించాడు కుమారస్వామి.**


బసంపల్లి సర్పంచ్ కూతురు కృష్ణవేణి పెళ్లి.. కుమారస్వామి కల్యాణమండపంలో జరపడానికి తలపెట్టినారు. పెండ్లికి ట్రాక్టర్లో కూర్చుని వైకుంఠప్ప భార్యా సమేతంగా వచ్చినాడు. డైనింగ్ హాల్‌లో ప్రసారం అవుతున్న వీడియోను చూశాడు. భోజనాలు చేస్తున్న జనాలు ఇప్పుడు చాలా ఆకుల్లో మెతుకు మిగల్చడంలేదు. సర్వం సద్వినియోగం అవుతోంది.

కుమారస్వామిని కలిసిన వైకుంఠప్ప..

"శానా మంచి పని చేశారయ్యా! ఇదే నేను కోరుకున్నది" అన్నాడు.

"అంతా నీచలవే వైకుంఠప్పా! మొత్తానికి భూమిపైన ఉండాల్సిన వాడివే. ఇప్పటికైనా ఇక్కడ ఉండటానికి మీరు ఒప్పుకొంటారా" అన్నాడు కుమారస్వామి. "సంతోషంగా ఉంటామయ్యా!".. చేతులెత్తి నమస్కరిస్తూ చెప్పాడు వైకుంఠప్ప..

## ఈ చిత్రంలో దాగిన 9 జంతువులు కనిపెడితే మీ చూపు డేగ చూపే.. 90 శాతం మంది ఫెయిల్




మన దృష్టికి, మెదడుకు పని కల్పించే ఆప్టికల్ ఇల్యూషన్లు, బ్రెయిన్ టీజర్లు తరచుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. అలాంటి పజిల్స్ పరిష్కరించడం కష్టమే అయినప్పటికీ.. ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో ఆనందం భిన్నంగా ఉంటుంది. ఇప్పుడు చాలా కష్టమైన ఆప్టికల్ ఇల్యూషన్ చిత్రం ఒకటి వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో ఎన్ని జంతువులు ఉన్నాయో మీరు గుర్తించాలి. కొంతమందికి గమ్మత్తైన పజిల్స్ ను పరిష్కరించడంలో అమితమైన ఆసక్తి.. వాటిని చూస్తూ.. జవాబుని తెలుసుకునే ప్రయత్నంలో ఎంత సమయం గడిచిపోయిందో కూడా తెలియదు. చాలా మంది ఇలాంటి ఆప్టికల్ ఇల్యూషన్ పజిల్స్‌ను పరిష్కరించడానికి ఆసక్తి చూపుతారు. అయితే కొన్ని చిత్రాలను చూసిన వెంటనే సమాధానం కనుగొనడం కష్టం కావచ్చు. భ్రమలో చిక్కుకున్న సమాధానం కోసం ఎన్నిసార్లు ప్రయత్నించినా, సరైన సమాధానం దొరకదు. ఇప్పుడు కూడా ఇలాంటి గమ్మత్తైన ఆప్టికల్ ఇల్యూషన్ చిత్రం వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో దాగి ఉన్న తొమ్మిది జంతువులను కనిపెట్టాలనే సవాలు ఇవ్వబడింది. మీరు ఈ పజిల్‌ను పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటే ఒక్కసారి చిత్రాన్ని పరిశీలన శక్తితో చూడండి.

**ఈ చిత్రంలో ఏముంది?**

X U²Ô @InterstingSTEM ద్వారా షేర్ చేయబడిన ఈ ఆప్టికల్ ఇల్యూషన్ చిత్రం పరిశీలన నైపుణ్యానికి పరీక్ష. ఈ చిత్రం "ఇది ఒక క్లాసిక్ బ్రెయిన్ టీజర్. మీరు ఎన్ని జంతువులను చూస్తున్నారో సమాధానం చెప్పండి అనే శీర్షికతో షేర్ చేశారు. ఈ చిత్రాన్ని చూసి అందులో ఎన్ని జంతువులు ఉన్నాయో చెప్పుకొండి చూద్దాం." ఈ చిత్రంలోని జంతువులూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. దీంతో పజిల్‌ను మరింత క్లిష్టతరం చేస్తుంది. దృష్టిని చిత్రంపై కేంద్రీకరించి సరైన సమాధానాన్ని ఊహించడానికి ప్రయత్నించండి. అయితే ఈ పజిల్‌ను పరిష్కరించడానికి సమయ పరిమితి లేదు.

# వానొస్తే కరెంట్ కట్.. గ్రేటర్‌లో నిత్యకృత్యంగా మారిన విద్యుత్ కోతలు



'మణికొండ, పుప్పాలగూడ, డైమండ్‌హిల్స్ ప్రాంతంలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంది. హెచ్చు తగ్గులతో సరఫరా అవుతుండటంతో ఇంట్లోని గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా స్పందన లేదు.' అని మణికొండకు చెందిన విద్యుత్ వినియోగదారుడు అనిల్ మల్లాడి ఆదివారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు.ఇలా ఒక్క మణికొండ ప్రాంతంలోనే కాదు.. గ్రేటర్‌లోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం అనేది నిత్యకృత్యంగా మారింది. వర్షం వస్తుందంటే చాలు %ొ% కరెంటు పోతుందన్న భయం నగరవాసులను వెంటాడుతూనే ఉన్నది. పది రోజుల నుంచి కురుస్తున్న వానలతో నగరంలో చాలా చోట్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. ఇటీవల మధురానగర్ డీ బ్లాక్ ప్రాంతంలో ఏకంగా 28 గంటల పాటు సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## చైనాలో మరో భయాంకర వైరస్ గుర్తింపు మెదడుపైనే ఎఫెక్ట్!



చైనాలో మరో కొత్త రకం వైరస్ బయటపడింది. వెట్‌ల్యాండ్ అని పిలవబడే అత్యంత ప్రమాదకరమైన వైరస్‌ను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మెదడు, నాడీ సంబంధిత వ్యాధులకు ఇది కారణమవుతుందని గుర్తించారు.ఈ వెట్‌ల్యాండ్ వైరస్‌ను తొలుత 2019లో గుర్తించారు. మంగోలియాలోని చిత్తడి నేలకు చెందిన ఓ 61 ఏళ్ల వృద్ధుడు అప్పట్లో అనారోగ్యానికి గురయ్యాడు. ఐదు రోజుల పాటు జ్వరం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపించాయి. ఈ లక్షణాలు కాస్త అనుమానాస్పదంగా ఉండటంతో పరిశోధకులు అప్రమత్తమయ్యారు. సమీప ప్రాంతాల్లోని దాదాపు 14,600 జీవులను సేకరించి అధ్యయనం చేశారు. వీటిలో దాదాపు రెండు శాతం పరాన్న జీవుల్లో జన్యు పదార్థం ఉన్నట్లు గుర్తించారు.అలాగే మంగోలియా ప్రాంతంలోని 640 మంది అటవీ అధికారుల రక్త నమూనాలను సేకరించి పరిశోధకులు విశ్లేషించారు. అందులో 12 మందిలో ఈ రకమైన వైరస్ ఉన్నట్లు తేలింది. జ్వరం, మైకం, తలనొప్పి, వికారం, విరేచనాలు వంటి లక్షణాలను వారిలో గుర్తించారు. వీరిలో మెదడు, వెన్నెముక ద్రవంలో అధిక తెల్ల రక్త కణాల సంఖ్య కారణంగా ఒక రోగి కోమాలోకి వెళ్లాడు. అయితే చికిత్స తర్వాత వీరంతా కోలుకున్నారు. కానీ ఎలుకలపై ల్యాబ్‌ల్లో చేసిన ప్రయోగాల్లో ప్రాణాంతకమైన ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతుందని గుర్తించారు. ముఖ్యంగా మెదడు, నాడీ సంబంధిత అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కనుగొన్నారు. తాజాగా ఈ అధ్యయానికి సంబంధించిన నివేదికను ది న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైంది.వెట్‌ల్యాండ్ వైరస్ అనేది క్రిమియన్ కాంగో హెమరేజిక్ ఫీవర్ గ్రూప్‌నకు చెందిన వైరస్. ఇది పరాన్న జీవుల ద్వారా వ్యాపిస్తుంది. పందులు, గొర్రెలు, గుర్రాల్లోనూ ఆర్ఎన్ఏ ఇది వరకే ఉన్నట్లు గుర్తించారు.

# ఆహారంతో ఆక్సిజన్






అత్యధిక స్థాయిలో యాంటిఆక్సిడెంట్లు లభించే పండ్లలో స్ట్రాబెర్రీలు ముందుంటాయి. ఇవి శరీరంలోకి ప్రవేశించే వ్యాధికారక బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. వీటిలోని పాలీఫినాల్ సమ్మేళనాలు.. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. స్ట్రాబెర్రీల్లో సమృద్ధిగా దొరికే విటమిన్ సి మూలకాలు.. శరీరంలోని పోషక లోపాలను సవరిస్తాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సినంత శక్తి లభించడంతోపాటు ఆక్సిజన్ స్థాయులూ పెరుగుతాయి.

**మామిడి:** రుచిలోనే కాదు.. మనిషికి ఆరోగ్యాన్ని ప్రసాదించడంలోనూ మామిడి పండు రారాజే! మామిడి పండ్లలో 'బీటా కెరోటిన్' అనే పదార్థం ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది ఎంతో సాయపడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి.. శరీరానికి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. వీటిని తినడం వల్ల శరీరంలో ఆక్సిజన్ లెవెల్స్ కూడా పెరుగుతాయి.

# గొప్ప స్నేహం

క్రీస్తు సందేశం



మన జీవితంలో ఓ మంచి స్నేహితుణ్ని సంపాదించుకోవడం చాలా కష్టతరం. ఈ స్వార్థ జగత్తులో, ఎవరి బతుకు వారిదే అన్నట్టున్న ఈ రోజుల్లో నిబద్ధత గలిగిన స్నేహితులు కనిపించడం అరుదైన విషయమే! మానవుడికి శుభం కలిగించే మంచి స్నేహం గురించి యోబు భక్తుడు చెబుతూ 'ఆయనతో సహవాసం చేసిన యెడల నీకు సమాధానం కలుగును ఆలాగున నీకు మేలు కలుగును' (యోబు, -22,:-21,) అని ప్రస్తావించాడు. దేవుడితో సహవాసమా? ఎంత గొప్ప భాగ్యం? దేవుడితోనే మాట్లాడుతూ, ఆయనతోనే ఆలోచిస్తూ, చర్చిస్తూ, అన్న పానీయాలు సేవిస్తూ ఆయనతోనే నిరంతరం నివసిస్తూ ఉండటం ఎంతటి అవకాశం!నిజమే ప్రభువుతో కలిసి నడిచిన వారికి, నిత్యం తిరిగిన వారికి అనుక్షణం ఆయన రక్షణ లభిస్తుంది. విడువక, ఎడబాయక మనల్ని కంటికి రెప్పలా కాచి కాపాడతాడు. అంతేకాదు 'నీవు నావాడవు' అని భరోసా ఇస్తాడు. అలా అనగలిగేది ప్రేమ, బాధ్యత ఉన్నవాడే. నీవు దాక్కునే స్థలంలో కూడా రక్షణ కవచంలా పక్షిరెక్కలా కాచి కాపాడే గొప్ప స్నేహితుడు దేవుడు. 'నేను నిన్ను విమోచించి యున్నాను భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను.. నీవు నా సొత్తు' (యెషయా 43:1) వాక్యాలు.. గొప్ప స్నేహాన్ని చాటిచెబుతాయి.

## టెల్కోలకు ఊరట టెంప్లెట్స్, కంటెంట్ రిజిస్ట్రేషన్ కోసం గడువు పెంచిన ట్రాయ్




స్పామ్ కాల్స్, స్పామ్ మెసేజ్‌లకు అడ్డుకట్ట వేసేందుకు టెలికం రెగ్యులరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్).. టెల్కోలకు మరొక నెల గడువు పొడిగించింది. వైట్ లిస్టెడ్ కానీ యూఆర్ఎల్స్, ఓటీటీ లింక్స్, ఏపీకే (ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీస్), కాల్ బ్యాక్ నంబర్లకు సంబంధించిన మెసేజ్‌లను నిలిపివేసే విషయమై టెలికం సంస్థలకు రిలీఫ్ కల్పించింది ట్రాయ్. టెలికం సంస్థలు %-% రిలయన్స్ జియో, భారతీ ఎయిర్ టెల్, వొడాఫోన్ ఐడియా- మెసేజ్ టెంప్లేట్స్, కంటెంట్‌లను ఈ నెల 31 లోపు రిజిస్టర్ చేసుకోవాలని ట్రాయ్ ఆదేశించింది. ఈ గడువు సరిపోదని, మరికొంత టైం పెంచాలని టెలికం సంస్థలు కోరారు.తాజాగా మరోమారు గడువు పొడిగించిన ట్రాయ్.. అక్టోబర్ ఒకటో తేదీ తర్వాత గడువు పొడిగించేది లేదని తేల్చి చెప్పింది. టెంప్లెట్స్, కంటెంట్ రిజిస్టర్ కాకుంటే మొబైల్ ఫోన్ యూజర్లకు సందేశాలు పంపడం నిలిపివేస్తామని పేర్కొంది. స్పామ్ కాల్స్, సందేశాలను నివారించడానికి, కంటెంట్ లేదా టెంప్లెట్స్ రిజిస్టర్ చేసుకోవడానికి టెలికం కంపెనీలన్నీ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ బేస్డ్ టూల్స్ వినియోగించాల్సి ఉంటుంది. ట్రాయ్ వద్ద రికార్డులకు అనుగుణంగా లేని మెసేజ్ లను అక్టోబర్ నుంచి నిలిపివేస్తారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై వేటు?



హైదరాబాద్ మహానగరంలో హైడ్రా మొన్నటి నుంచి బీభత్సం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. పొద్దున లేస్తే చాలు హైడ్రా... కూల్చివేతలే టీవీ ఛానల్ లో కనిపిస్తున్నాయి.పేద దానికి అనే తేడాలు లేకుండా... ప్రతి ఒక్కరికి నోటీసులు ఇచ్చి మరి అక్రమంగా నిర్మించిన ఇండ్లను అలాగే ఫామ్ హౌస్ లను... ధ్వంసం చేస్తోంది హైడ్రా. 1974 జియోగ్రాఫికల్... మ్యాప్ ఆధారంగా చెరువులను మళ్లీ పునరుద్ధరించేందుకు హైడ్రాను తీసుకువచ్చారు. అయితే 1974 ప్రకారం చూసుకున్నట్లయితే.. చాలావరకు కట్టడాలు... చెరువులోనే జరిగాయి. దీంతో రేవంత్ రెడ్డి అన్నయ్య తిరుపతి రెడ్డి అలాగే నాగార్జున లాంటి వారు తప్పిదాలు చేసి ఎఫ్టిఎల్ పరిధిలో స్థలాలు అలాగే ఇండ్లు కొనుగోలు చేసి ఇప్పుడు అవమానాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే అక్కినేని నాగార్జున %చీ% కన్వెన్షన్..ను ధ్వంసం చేశారు అధికారులు. రేవంత్ అన్న తిరుపతిరెడ్డి, మురళీమోహన్ లాంటి వారికి కూడా నోటీసులు ఇచ్చారు.అదే సమయంలో పేదవారికి సంబంధించిన ఇండ్లను కూడా ధ్వంసం చేస్తుంది హైడ్రా. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి కంటే... హైడ్రా కమిషనర్ రంగనాథ్ బాగా హైలైట్ అవుతున్నారు. ఈ తరుణంలోనే తెరపైకి కొత్త విషయం వచ్చింది. అతి త్వరలోనే రంగనాథ్.. ఆ పోస్టు నుంచి బదిలీ కాబోతున్నారట. ఆయన స్థానంలో ఓ డమ్మీ అధికారిని హైడ్రా కమిషనర్ చేయబోతున్నారట. అయితే హైడ్రా కూల్చివేతల వల్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి... వ్యతిరేకత వస్తుందని కాంగ్రెస్ పార్టీ గ్రహించిందని సమాచారం.అందుకే హైడ్రా పవర్స్ తగ్గించేందుకు కమిషనర్ను మార్చుతున్నారట. ఇందులో భాగంగానే హైడ్రా తాజాగా కీలక ప్రకటన కూడా చేసింది. ఎఫ్టిఎల్ పరిధిలో ఉన్న నివాస గృహాలను అస్సలు కూల్చబోమని తెలిపింది. ఎఫ్ టి ఎల్ పరిధిలో ఇప్పుడు కడుతున్న కట్టడాలను మాత్రమే ధ్వంసం చేస్తామని ప్రకటన చేశారు రంగనాథ్. ఇక ఈ ప్రకటనతో త్వరలోనే రంగనాదు పై వేటు పడనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# మొబైల్ ఫోన్లతో బ్రెయిన్ క్యాన్సర్ ముప్పుపై తాజా సర్వేలో ఏం తేలిందంటే..!



ఆధునిక జీవితంలో ప్రతి ఒక్కరూ రోజులో ఎక్కువ గంటలు మొబైల్ ఫోన్లతోనే గడుపుతున్నారు. ఫోన్ లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేని వారెంతో మంది. మొబైల్ ఫోన్ల విపరీత వాడకంతో ఎన్నో దుష్పరిణామాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే మొబైల్ ఫోన్ల వాడకం గురించి తాజా అధ్యయనం వివరాలు కాస్త ఉపశమనం కలిగించేలా ఉన్నాయి. మొబైల్ ఫోన్లతో బ్రెయిన్ క్యాన్సర్ ముప్పు పెరగదని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.మొబైల్ ఫోన్లు, బ్రెయిన్ క్యాన్సర్ మధ్య ఎలాంటి సంబంధం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (%ఔనూ%) రివ్యూ వెల్లడించింది. గత కొద్ది దశాబ్దాలుగా మొబైల్ ఫోన్ వాడకం విపరీతంగా పెరిగినా అదే స్థాయిలో బ్రైన్ క్యాన్సర్ల కేసులు పెరగలేదని పేర్కొంది. పదేండ్లకు పైగా మొబైల్ ఫోన్లు వాడుతున్న వారు, మొబైల్ ఫోన్లతో ఎక్కువ సమయం గడిపేవారిలోనూ బ్రెయిన్ క్యాన్సర్ కేసుల సంఖ్య పెరగలేదని గుర్తించారు. 1994, 2022 మధ్య న్విహించిన 63 అధ్యయనాలను ఈ రివ్యూ పరిశీలించింది. ఆస్ట్రేలియా ప్రభుత్వ రేడియేషన్ ప్రొటెక్షన్ అథారిటీ నిపుణులు సహా పది దేశాల నుంచి 11 మంది పరిశోధకులు ఈ రీసెర్చ్‌ను చేపట్టారు.మొబైల్ ఫోన్లు, టీవీలు, బేబీ మానిటర్స్, రాడార్ వంటి పరికరాల్లో ఉపయోగించే రేడియోఫ్రీక్వెన్సీ రేడియేషన్ ప్రభావాలపై ఈ రివ్యూ ప్రధానంగా దృష్టిసారించింది. ఈ అధ్యయనంలో మొబైల్ ఫోన్ల వాడకానికి, బ్రెయిన్ క్యాన్సర్‌కు ఎలాంటి సంబంధం వెల్లడికాలేదని అధ్యయన సహ రచయిత, యూనివర్సిటీ ఆఫ్ అక్లాండ్, న్యూజిలాండ్ క్యాన్సర్ ఎపిడమాలజీ నిపుణులు ప్రొఫెసర్ మార్క్ ఎల్వుడ్ తెలిపారు. ఇక ఇతర రకాల క్యాన్సర్‌లకు సంబంధించిన అధ్యయనం వేరొక నివేదికలో పొందుపరిచామని చెప్పారు.

# సమస్యా నీదే పరిష్కారమూ నీదే!

గీతా వాక్యం

న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖానిచ!
కింనో రాజ్యేన గోవింద! కిం భోగైర్జీవితేన వా?



'కృష్ణా! నాకు విజయంపై కోరికలేదు. ఓ! గోవిందా.. నాకు ఈ రాజ్యంతో గానీ, భోగాలతో గానీ, జీవితంతో గానీ ఏ విధమైన ప్రయోజనం లేదు!' అంటూ కురుక్షేత్రంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు. అది కురుక్షేత్రం. అంటేనే కార్యక్షేత్రం. అక్కడ కర్తవ్యాన్ని నిర్వహించాలే కానీ, సొంత భావనలకు అవకాశం ఉండదు. క్షత్రియుడిగా అర్జునుడి కర్తవ్యం ధర్మహాని జరుగుతున్న సమయంలో, అధర్మాన్ని నిగ్రహించి ధర్మాన్ని సంస్థాపించడం. నిర్దేశిత ధర్మాచరణకు సిద్ధమై కురుక్షేత్రానికి వచ్చిన అర్జునుడు.. ఇరుసైన్యాలలో తనవారిని చూసి, విమోహియై అస్త్రసన్యాసం చేస్తున్నాడు. కార్యాచరణవేళ సమర్థుడైన వ్యక్తి అస్త్రసన్యాసం చేయడం అవాంఛనీయం.లక్ష్యం నిర్దేశితమైంది. వనరులు సమకూర్చుకున్నారు. యోజనా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎవరి బాధ్యతలు వారికి అప్పగించడం జరిగింది. అర్జునుడి కార్య నిర్వహణా దక్షత, ధైర్య సాహసాలు, ప్రజ్ఞాపాటవాలు, గతంలో తాను సాధించిన విజయాలు ప్రాతిపదికగా.. అతణ్ని పూర్తిగా నమ్మి ఏడు అక్షౌహిణులతో పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని ఎదిరించడానికి రంగం సిద్ధమైంది. ఆ సమయంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు.ఇక్కడ కృష్ణా, గోవిందా అనే రెండు సంబోధనలు ముఖ్యమైనవి. 'కృష్..' అనేది భూవాచకం. భూమి ఫలితాన్నిస్తుంది. భూమి కృషికి, కర్తవ్యపాలనకు సంకేతం. 'ణ' కారం నివృత్తి మార్గం. ఫలితాపేక్షతో చేసే కృషి వల్ల మోక్షం రాదు. ఫలితాపేక్షలేకుండా ఎవరైతే కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహిస్తారో వారికి మోక్షం వస్తుంది. 'నేను చంపుతున్నాను' అనే కర్తృత్వ భావన అర్జునుడిలో ఉంది.గోవిందా అనడంలో%ొ% 'గో' శబ్దం ఇంద్రియాలకు ప్రతీక. ఇంద్రియాలను జయించిన వారికి శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చేవాడు గోవిందుడు. ఇంద్రియాలను జయించడం అంటే ఇంద్రియాల పని విధానాన్ని అవగాహన చేసుకొని, వాటిని ప్రభావవంతంగా ఉపయోగించుకోవడం మాత్రమే. జీవితమనే మరొక పదం ఉన్నది ఇందులో. బతకడం వేరు, జీవించడం వేరు. జీవించడంలో ప్రయోజనం ఉంది. అర్థవంతమైన, ప్రయోజనకరమైన, ఆనందకరమైన, అభ్యుదయకారకమైనది జీవితం. సుఖభోగాలు రెండూ భౌతిక జీవితానికి సంబంధించినవే. ప్రలోభానికి గురిచేసేవే. రాజ్యమూ శాశ్వతం కాదు. 'అశాశ్వత రాజ్యభోగాల కోసం, అయినవారిని అంతమొందించడం యుక్తమా?' అని సంశయిస్తున్నాడు అర్జునుడు.అర్జునుడు ఇప్పుడు తన సమర్థత కన్నా తక్కువ స్థాయి భావాలని ప్రదర్శించి అవే ఉదాత్తమైనవిగా భ్రమపడుతున్నాడు. తనకు యుద్ధాలు కొత్తనా? ఎన్నో యుద్ధాలలో పాల్గొని జైత్రయాత్రలు చేశాడు. ఆ యుద్ధాలలో ఎందరు చనిపోలేదు? పిరికివాడా.. అంటే కాలకేయ నివాత కవచాది రాక్షసులను నిగ్రహించాడు. ఇంద్రుని అర్ధ సింహాసనాన్ని అధిష్ఠించాడు. భౌతిక సంపదల పట్ల ఉదాసీనత మోక్షానికి అవసరమే! కానీ, అర్జునుడిలో ఇంకా అలాంటి మానసికస్థితి ఉత్పన్నం కాలేదు. అతని మనసు, బుద్ధి కలత చెంది ద్వైదీ భావనలతో సంక్షుభితమై అయోమయంలో ఉన్నాయి. కర్తవ్యంపై అసంతృప్తితో కూడిన వేదన కలిగింది. విభ్రమకు లోనైన మనసుతో తనది కారుణ్య భావన అనే ముసుగులో నిర్వికారతను ఆశ్రయించాడు. అర్జునుడు ధర్మ స్థాపనలో అనివార్యమైతే యుద్ధంలో ఎవరినైనా ఎదిరించాలే కానీ, క్లీబత్వాన్ని చూపకూడదనే జ్ఞానం లేనివాడా? అంటే కాదు. మరి ఎందుకా నిర్వేదన? మనసు చంచలమైనప్పుడు సందిగ్ధత పలకరిస్తుంది. ఆ సమయంలోనే మార్గదర్శకుడు అవసరమవుతాడు. వ్యక్తిలో సహజ స్థితియైన చేతన వెలుగు చూడాలి. దానికి ప్రేరణనిస్తూ వ్యక్తిని కర్తవ్యపరాయణుడిని చేసే దిశలో నడిపించేది భగవద్గీత.

# శ్రీవరసిద్ధి వినాయకస్వామినే నమః ధ్యాయామి ధ్యానం సమర్పయామి





(కింది శ్లోకం చదువుతూ స్వామిపై అక్షతలు వేస్తూ నమస్కరించాలి) ఆవాహనం శ్లో? అత్రాగచ్ఛ జగద్వంద్య సురరాజార్చితేశ్వర అనాథనాథ సర్వజ్ఞ, గౌరీగర్భ సముద్భవ ?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః ఆవాహయామి ఆవాహనం సమర్పయామి (కింది శ్లోకం చదువుతూ స్వామిపై అక్షతలు వేస్తూ నమస్కరించాలి)ఆసనం శ్లో? మౌక్తికైః పుష్యరాగైశ్చ నానారత్నైర్విరాజితం రత్న సింహాసనం చారు ప్రీత్యర్థం ప్రతిగృహ్యతాం ?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః నవరత్న ఖచిత స్వర్ణసింహాసనార్థం-హరిద్రాక్షతాన్ సమర్పయామి.(కింది శ్లోకం చదువుతూ పుష్పముతో గణేశుని చేతులపై నీళ్లు చల్లాలి) అర్ఘ్యం శ్లో? గౌరీపుత్ర నమస్తేస్తు శంకరస్య ప్రియనందన గృహాణార్ఘ్యం మయాదత్తం గంధపుష్పాక్షతైర్యుతం ?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః హస్తయోః అర్ఘ్యం సమర్పయామి (కింది శ్లోకం చదువుతూ పుష్పముతో గణేషుని పాదాలపై నీళ్లు చల్లాలి)పాద్యం శ్లో? గజవక్త్ర నమస్తేస్తు సర్వాభీష్టప్రదాయక భక్త్యాపాద్యం మయాదత్తం గృహాణ ద్విరదానన ?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః పాదయోః పాద్యం సమర్పయామి ఆచమనీయం శ్లో? అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ వరపూజిత గృహాణాచమనం దేవ తుభ్యం దత్తం మయా ప్రభో?ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః ముఖే శుద్ధ ఆచమనీయం సమర్పయామి ఏకబిగిన రాసేశాడు తెలివితేటలకు గణపతిని ప్రతీకగా భావిస్తారు. వ్యాసుడు చెప్పిన మహాభారతాన్ని రాసింది ఆయనే. వ్యాసుడు భారతం రాయడానికి సర్వజ్ఞుడైన ఒక లేఖకుడు కావాలనుకున్నాడు. వినాయకుడి కన్నా సమర్థుడైన లేఖకుడు మరెవరూ ఉండరని భావించాడు. తాను చెబుతుంటే మహాభారతం రాసి పెట్టాల్సిందిగా గణేశుడిని అడిగాడు వ్యాసుడు. అయితే, గణపతి వెంటనే సమ్మతించలేదు. వ్యాసుడికి పరీక్ష పెట్టాలనుకున్నాడు. 'మహర్షి తన మనోఫలకంపై దర్శించిన విషయాలు చెబుతారా? పాండిత్య ప్రదర్శన చేస్తారా?' తెలుసుకోవాలని భావించాడు.మహాభారతం రాయడానికి అంగీకరిస్తూనే ఒక షరతు విధించాడు. 'మీరు ఆపకుండా చెబితేనే రాస్తాను, ఎక్కడ తటపటాయించినా ఘంటం పక్కన పెట్టేస్తాను, మళ్లీ ముట్టుకోను' అంటాడు. అందుకు వ్యాసుడు అంగీకరిస్తాడు. అలా లక్షకుపైగా శ్లోకాలు ఉన్న మహాభారతాన్ని ఆపకుండా చెప్పాడు. వ్యాసుడు చెప్పింది చెప్పినట్టుగా ఆపకుండా కావ్యాన్ని పూర్తిగా రాశాడు గణేశుడు.



### ధర్మసందేహం

గణపతికి కుడుములు, ఉండ్రాళ్లు నైవేద్యంగా ఎందుకు సమర్పిస్తారు?'లక్ష్యం లక్షప్రదో లక్ష్యో లయస్థో లడ్డుకప్రియః లాసప్రియో లాస్యపరో లాభకృల్లోక విశ్రుతః?'అంటుంది గణపతి సహస్రనామ స్తోత్రం. లోకఖ్యాతి గడించిన వినాయకుడిని 'లడ్డుక ప్రియః' అని గణేశ పురాణమూ చెబుతున్నది. అందుకే వినాయకుడికి ఉండ్రాళ్లు, కుడుములు, మోదక్‌లతోపాటు లడ్డూలనూ నివేదనగా సమర్పిస్తారు'ముదాకరాత్త మోదకం, సదా విముక్తి సాధకం' అని గణేశ పంచరత్న స్తోత్రంలో గజాననుడిని స్తుతించారు ఆదిశంకరాచార్యులు. 'మోదకాలను నైవేద్యంగా పెట్టగానే ఆనందించే దైవమా!' అని కీర్తించారు. గణపతికి ఇష్టమైన కుడుముల గురించి పురాణాల్లోనూ ఒక కథ ప్రచారంలో ఉంది.ఒకసారి బాల గణపతితో కలిసి శివపార్వతులు అరణ్యంలో సంచరిస్తుంటారు. గణేశుడికి ఆకలి వేయడంతో సమీపంలో ఉన్న అత్రి మహాముని ఆశ్రమానికి వెళ్తారు. వారికి ఘనమైన అతిథ్యం ఇస్తారు అత్రి మహర్షి, అనసూయాదేవి దంపతులు. ఆకలిగా ఉన్న బాల వినాయకుడికి పంచభక్ష్య పరమాన్నాలు చేసి వడ్డిస్తుంది అనసూయాదేవి.ఎంత తిన్నా, బొజ్జ గణపయ్య ఆకలి తీరదు. అప్పుడు ఆ ఇల్లాలు వరిపిండితో చేసిన కుడుము ఒకటి ఇస్తుంది. అది తినగానే గణపతి బొజ్జనిండి 21సార్లు త్రేన్చాడట! అప్పటినుంచి 21 కుడుములు, 21 ఉండ్రాళ్లు గణపతికి నైవేద్యంగా పెట్టి, ఒక్కోటి గణపతికి ఇచ్చి, పదేసి చొప్పున దానం చేసి, మిగతావాటిని ప్రసాదంగా తీసుకుంటారు. వినాయక మంటపాల్లో కుడుములకు ప్రతిగా లడ్డూను స్వామివారికి నైవేద్యం సమర్పించే ఆచారం ఉంది.




# 'రానా నాయుడు-2' వెబ్ సిరీస్ రివ్యూ

**నటీనటులు:**

రానా దగ్గుబాటి- వెంకటేష్ దగ్గుబాటి- సుర్వీన్ చావ్లా-కృతి కర్బందా-అర్జున్ రాంపాల్- అభిషేక్ బెనర్జీ-సుశాంత్ సింగ్-డినో మోరియా-రజత్ కపూర్-ఆదిత్య మేనన్ తదితరులు

**సంగీతం: సంగీత్-సిద్దార్థ్**

**ఛాయాగ్రహణం: జాన్ సచ్మిట్**

**నిర్మాతలు: సుందర్ ఆరోన్-సుమిత్ శుక్లా**

**దర్శకత్వం: సుపర్ణ్ వర్మ-కరణ్ అన్షుమన్**

టాలీవుడ్లో మిడ్ రేంజ్ హీరోలు సైతం ఇంకా ఓటీటీల వైపు చూడని సమయంలో విక్టరీ వెంకటేష్ లాంటి అగ్ర కథనాయకుడు.. తన అన్న కొడుకు రానా దగ్గుబాటితో కలిసి డిజిటల్ ఎంట్రీ ఇచ్చిన సిరీస్.. రానా నాయుడు. రెండేళ్ల కిందట వచ్చిన తొలి సీజన్..వెంకీ అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. విషయం తక్కువ.. బూతులెక్కువ అంటూ తీవ్ర అసహనం చెందారు వెంకీ అభిమానులు. ఇప్పుడీ సిరీస్ రెండో సీజన్తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈసారైనా వెంకీ-రానా ఫ్యాన్స్ ఈ సిరీస్ను మెచ్చేలా ఉందా? చూద్దాం పదండి.

**కథ:**

ఎన్ని అడ్డదారులైనా తొక్కి సెలబ్రెటీలకు వచ్చే సమస్యలను పరిష్కరించే ఫిక్సర్ గా పేరున్న రానా నాయుడు (రానా దగ్గుబాటి).. దీని ద్వారా ఎంత డబ్బు సంపాదించినా మనశ్శాంతి లేకుండా బతుకుతుంటాడు. దీంతో భార్య కోరిక మేరకు ఇకపై ఇవన్నీ వదిలేయాలని అనుకుంటాడు. తాను పని చేస్తున్న మంత్రి ఓబీ నుంచి విడిపోతాడు. కానీ అంతలో రానా కొడుకు అనీ కిడ్నాప్ అవుతాడు. దీంతో తిరిగి పాత శైలికి మారిపోతాడు రానా. ఈ క్రమంలో అతను ఒబెరాయ్ (రజత్ కపూర్) దగ్గర పనికి కుదురుతాడు. మరోవైపు రానాకు రవూఫ్ (అర్జున్ రాంపాల్)తో శత్రుత్వం పెరుగుతుంది. తన తండ్రి నాగ నాయుడు (వెంకటేష్) నుంచి కూడా తలనొప్పులు తప్పవు. దీంతో రానా కుటుంబం మరింత ఇబ్బందుల్లో చిక్కుకుంటుంది. మరి ఈ సమస్యలన్నింటినీ రానా పరిష్కరించుకున్నాడా.. ఈ క్రమంలో ఏం కోల్పోయాడు.. రానా కుటుంబం ఒక్కటైందా లేదా అన్నది మిగతా కథ.

**కథనం-విశ్లేషణ:**

రానా నాయుడు తొలి సీజన్ రిలీజైనపుడు అదెంత ఆసక్తికరంగా ఉందన్న దాని మీద కంటే.. అందులో హద్దులు దాటిన బూతులు.. భరించలేని వల్గర్ సీన్ల గురించే ఎక్కువ చర్చ జరిగింది. ముఖ్యంగా ఫ్యామిలీ హీరోగా ముద్ర పడ్డ వెంకీ నుంచి ఇలాంటి కంటెంట్ రావడాన్ని ఆయన అభిమానులు అస్సలు జీర్ణించుకోలేకపోయారు. రెండో సీజన్ కు వచ్చేసరికి మేకర్స్ ఈ ఫీడ్ బ్యాక్ మీద గట్టిగానే పని చేసినట్లున్నారు. బూతుల డోస్ బాగా తగ్గిపోయింది. ఇక వల్గర్ సీన్లు కూడా అంతగా కనిపించవు. కొంచెం బోల్డ్ సీన్లయితే ఉన్నాయి కానీ.. తొలి సీజన్ తరహాలో వల్గారిటీ అయితే లేదు. ఐతే దీంతో పాటే కథాకథనాల మీద కూడా కొంచెం దృష్టిపెట్టి ఉంటే బాగుండేది. తొలి సీజన్లో అయినా కథలో కొన్ని ఆసక్తికర మలుపులు ఉన్నాయి.. అక్కడక్కడా కొన్ని ఎపిసోడ్లు ఆసక్తి రేకెత్తిస్తాయి కానీ.. రెండో సీజన్ అయితే పూర్తి తేలిపోయింది. కొత్త పాత్రలు.. కొత్త విలన్లు వచ్చారు తప్ప.. కథలో ఏమంత కొత్తదనం కనిపించదు. అసలు హీరో లక్ష్యమేంటో అర్థం కాదు. ఏ పాత్ర పరమార్థమేంటో బోధపడదు. కొత్తగా మొదలైన పాత్రలతో రవ్వంత కూడా ఎమోషనల్ కనెక్షన్ ఏర్పడదు. ఎనిమిది ఎపిసోడ్లతో దాదాపు ఆరు గంటల సుదీర్ఘ నిడివితో సాగే సిరీస్ లో వారెవా అనిపించే ఒక్క ఎపిసోడ్ లేదంటే ఇది ఏమాత్రం ఎంగేజ్ చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. 'రానా నాయుడు' తొలి సీజన్లో ఏ పాత్ర ఏంటో తెలుసుకోవడానికి.. కథేంటో అర్థం చేసుకోవడానికి.. కొంత సమయం పడుతుంది. అందుకోసమైనా ఆసక్తిగా సిరీస్ చూస్తాం. ఆ రకంగా అయినా ఆ సీజన్ ప్రేక్షకులను కొంత ఎంగేజ్ చేస్తుంది. కానీ కథేంటో తెలిసిపోయాక.. పాత్రలేంటో అర్థమైపోయాక.. రెండో సీజన్ ఆసక్తికరంగా సాగాలంటే కొత్తగా అనేక మలుపులు ఉండాలి. అవి తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠను రేకెత్తించాలి. కానీ 'రానా నాయుడు' ఏ దశలోనూ ప్రేక్షకుల్లో ఉత్సాహం.. ఉత్కంఠ కలిగించదు. అర్జున్ రాంపాల్ పోషించిన కొత్త విలన్ పాత్ర అయితే పూర్తిగా వ్యర్థంగా అనిపిస్తుంది. ట్రైలర్లో ఆ పాత్రకు ఇచ్చిన బిల్డప్ కు.. సిరీస్ లో దాన్ని నడిపించిన తీరుకు పొంతన లేదు. అసలు రానా నాయుడికి.. అతడికి శత్రుత్వాన్ని సరిగానే ఎస్టాబ్లిష్ చేయలేదు. ఆ క్యారెక్టర్ ఏంటన్నదే అసలు అంతుబట్టదు. దీంతో పోలిస్తే హీరోకు కొత్త యజమానిగా మారే విరాజ్ ఒబెరాయ్ పాత్ర.. దాని చుట్టూ నడిపిన స్టోరీ కొంచెం నయం. చివరి రెండు ఎపిసోడ్లలో ఈ పాత్రతో ముడిపడ్డ కథనం.. కొన్ని మలుపులు ఆసక్తి రేకెత్తిస్తాయి. కానీ మెయిన్ విలన్ ట్రాక్ మాత్రం పూర్తిగా తేలిపోయింది. రానా నాయుడు కుటుంబం మీద చాలా సన్నివేశాలు నడిపించారు కానీ.. అందులో ఒక్కటీ ప్రేక్షకులను ఎంగేజ్ చేయదు. ముఖ్యంగా వెంకటేష్ పాత్ర అసలీ సిరీస్ లో ఎందుకు ఉందో అర్థం కాదు. తొలి సీజన్లో అయినా.. ఆ పాత్ర తాలూకు బ్యాక్ స్టోరీ కొంత ఎంగేజ్ చేస్తుంది కానీ.. ఈసారి మాత్రం ఆ పాత్రను పూర్తిగా తేల్చి పడేశారు. తండ్రీ కొడుకుల మధ్య బంధాన్ని కానీ.. వారి మధ్య విభేదాలను కూడా సరిగా చూపించలేదు. వెంకీది జస్ట్ ఒక సహాయ పాత్రలా అనిపిస్తుంది తప్ప.. కథలో దానికి తగిన ప్రాధాన్యమే లేకపోయింది. అతను ఎప్పుడు ఏం చేస్తాడో అర్థం కాదు. ఇక ఆయన కొడుకుల పాత్రల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. బలమైన కాన్ఫ్లిక్ట్ పాయింట్ లేకపోవడంతో 'రానా నాయుడు-2'లో అతి పెద్ద బలహీనత. ఒకదాని వెంట ఒకటి పరిణామాలు జరిగిపోతుంటాయి కానీ.. ఏదీ ప్రేక్షకుల అటెన్షన్ రాబట్టదు. మొత్తం సిరీస్ అయ్యాక ఆరు గంటలు వృథా అయిన భావనే కలుగుతుంది తప్ప.. చెప్పుకోవడానికి ఇందులో ఒక్క స్టాండౌట్ ఎపిసోడ్ కూడా కనిపించదు.




**నటీనటులు:**

'రానా నాయుడు'కు చెప్పుకోదగ్గ ఆకర్షణ అంటే.. రానా నటనే. సిరీస్ మొత్తంలో పర్ఫెక్ట్ కాస్ట్ అనిపించేది అతనే. ఈ పాత్రను బాగా అవగాహన చేసుకుని అందులో ఒదిగిపోవడానికి రానా ప్రయత్నించాడు. తొలి సీజన్ తో పోలిస్తే మరింత కాన్ఫిడెంట్ గా నటించాడు. తన స్క్రీన్ ప్రెజెన్స్ చాలా బాగుంది. రానా కోసం యునీక్ క్యారెక్టర్లు రాయడానికి ఈ పాత్ర స్ఫూర్తిగా నిలుస్తుంది. వెంకటేష్ మాత్రం మరోసారి నిరాశపరిచాడు. ఆయన చేయదగ్గ పాత్ర కాదిది. ఆయన క్యారెక్టర్ని వ్యర్థంగా మార్చేశారు రెండో సీజన్లో. సుర్వీన్ చావ్లా చూడ్డానికి బాగుంది. హాట్ హాట్ గా కనిపిస్తూ.. నటనలోనూ ఆకట్టుకుంది. బోల్డ్ సీన్లో ఆమె కుర్రాళ్లను బాగానే ఆకట్టుకుంటుంది. విలన్ పాత్రలో అర్జున్ రాంపాల్ ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. రజత్ కపూర్.. కృతి కర్బందా కీలక పాత్రల్లో రాణించారు. సుశాంత్ సింగ్.. అభిషేక్ బెనర్జీ.. ఆదిత్య మేనన్.. వీళ్లంతా ఓకే.

**సాంకేతిక వర్గం:**

టెక్నికల్ గా 'రానా నాయుడు' ఓకే అనిపిస్తుంది. బ్యాగ్రౌండ్ స్కోర్.. సినిమాటోగ్రఫీ బాగున్నాయి. సిరీస్ లో మంచి క్వాలిటీ కనిపిస్తుంది. నిర్మాణ విలువల్లో ఏమీ రాజీ పడలేదు. కానీ అమెరికన్ టీవీ సిరీస్ 'రే డొనోవన్'ను మనకు తగ్గట్లుగా అడాప్ట్ చేయడంలో దర్శకులు సుపర్ణ్ వర్మ-కరణ్ అన్షుమన్ నైపుణ్యం చూపించలేకపోయారు. సామాన్య జనానికి కనెక్ట్ అయ్యే కథాంశం.. పాత్రలు మిస్ కావడం 'రానా నాయుడు'కు అతి పెద్ద మైనస్. ఈ కథంతా వేరే ప్రపంచంలో నడుస్తున్నట్లు అనిపిస్తుంది. కథతో.. పాత్రలతో ఎమోషనల్ కనెక్ట్ ఏర్పరచడంలో దర్శక ద్వయం పూర్తిగా విఫలమైంది.

**చివరగా: రానా నాయుడు-2..**
**'బోల్డ్' తగ్గింది.. 'బోర్' పెరిగింది**
**రేటింగ్-2/5**

# అన్ని చోట్లా బన్నీ దుమ్ము దుమారమే!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప2' బాలీవుడ్ ని సైతం ఏ రేంజ్ లో షేక్ చేసిందో తెలిసిందే. ఓ తెలుగు సినిమా ఏకంగా హిందీ బాక్సాఫీస్ రికార్డులను సైతం చెరిపేసి సరికొత్త చరిత్ర రాసింది. ఒక్క 'దంగల్' తప్ప మిగతా అన్ని రికార్డులు బ్రేక్ అయ్యాయి. థియేట్రికల్ గా సాధించిన సక్సెస్ ఇది. ఇక ఓటీటీ ...శాటిలైట్ బిజినెస్ గురించైతే చెప్పాల్సిన పనిలేదు. అటుపై రిలీజ్ అనంతరం అక్కడ గ్రాండ్ విక్టరీని నమోదు చేసింది. శాటిలైట్ పరంగా 'పుష్ప 2' హిందీ లో రికార్డు సృష్టించింది. ఈ సినిమాకు ఏంగా 5.1 టీఆర్పీ రేటింగ్ వచ్చింది. ఓ ప్రముఖ హిందీ టెలివిజన్ ఛానల్ లో ప్రసారం కాగా ఈ ఫీట్ సాధించింది. మరో విశేషం ఏంటంటే? ఐపీఎల్ ను కూడా బీట్ చేసింది. రీసెంట్ ఐపీఎల్ యావరేజ కన్నా 'పుష్ప2' హైలో కనిపిస్తుంది. ఈ మధ్య కాలంలో రిలీజ్ అయిన ఏ బాలీవుడ్ సినిమాకు ఈ రేంజ్ లో టీఆర్పీ దక్కలేదు. దీంతో శాటిలైట్ బాసులు సైతం షాక్ అవుతున్నారు. పెద్ద తెరపైనపే కాదు..చిన్న పెర తెరపైనా మరోసారి ఓ తెలుగు హీరో సత్తా చాటాడని మాట్లాడుకుంటు న్నారు. టీఆర్పీ రేటింగ్ తో వాళ్లంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో వేసిన ఏ హిందీ సినిమాకు ఈ రేంజ్ లో టీఆర్పీ రాలేదని వాళ్లే దిగొచ్చి చెబుతున్నారు. ఈ సినిమా తర్వాత మళ్లీ ఆ రేంజ్ హైప్ 'అఖండ 2'కి ఉంది. ఈ సినిమా సెప్టెంబర్ లో భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. హిందీ బుల్లి తెరపై అఖండ పెద్ద సక్సెస్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్ గానే అఖండ 2 రిలీజ్ అవుతుండటంతో ఓటీటీ..శాటిలైట్ పరంగా పెద్ద ఎత్తున బిజినెస్ ఆఫర్లు వస్తున్నాయి. బాలయ్య మాస్ అప్పిరియన్స్...హిందుత్వం కాన్సెప్ట్ తో నార్త్ కి ఆడియన్స్ ఈ సినిమా బాగా కనెక్ట్ అవుతుంది.

# అందుకే సినిమాలకు దూరంగా ఉంటున్నా



సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ల కొరత ఎంతో ఎక్కువ ఉంది. అయినప్పటికీ టాలెంటెడ్ హీరోయిన్లు కొన్ని సినిమాలకే పరిమితమవుతూ వస్తున్నారు. అందానికి అందం, టాలెంట్ కు టాలెంట్ ఉన్నప్పటికీ కొంతమంది అలా మెరిసి ఇలా మాయమవుతుంటే, ఇంకొందరు సినిమాలు మానేసి పెళ్లి చేసుకుని సెటిలైపోతున్నారు. దీంతో ఫ్యాన్స్ వారిని సినిమాల్లో చూడటాన్ని మిస్ అయిపోతున్నారు. ఇక చేసేదేమీ లేక వారిని సోషల్ మీడియాలో ఫాలో అవుతూ ముచ్చట పడుతున్నారు. అలా సినిమాలు చేస్తూ చేస్తూ సడెన్ గా పెళ్లి చేసుకుని సినిమాలకు దూరమైన ఓ హీరోయిన్ కోసం కూడా నెటిజన్లు నెట్టింట తెగ వెతుకుతున్నారు. ఆ హీరోయిన్ మరెవరో కాదు, బాపు గారి బొమ్మ ప్రణీతా సుభాష్. అమ్మడికి అందం, అభినయం ఉన్నా కూడా కోరుకున్న సక్సెస్ అందుకోలేకపోయింది. హీరోయిన్ గా, సెకండ్ హీరోయిన్ గా పలు సినిమాల్లో నటించి ఆడియన్స్ ను మెప్పించిన ప్రణీతా ఏం పిల్లో ఏం పిల్లడో సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాలోనే తన క్యూట్ లుక్స్ తో ఆడియన్స్ ను మెప్పించిన ప్రణీతా ఆ తర్వాత హీరోయిన్ గా వరుస సినిమాలు చేసింది. హీరోయిన్ గా అనుకున్న గుర్తింపు రాకపోవడంతో ఆ తర్వాత సెకండ్ హీరోయిన్ గా కూడా తన లక్ ను టెస్ట్ చేసుకుంది. సెకండ్ హీరోయిన్ గా పవన్ కళ్యాణ్ తో కలిసి చేసిన అత్తారింటికి దారేది సినిమా ప్రణీతాకు మంచి సక్సెస్ ను అందించింది. అయినా ఆ హిట్ తన కెరీర్ కు ఏమంత ఉపయోగపడలేదు. దీంతో కెరీర్ పీక్ లో ఉన్నప్పుడే పెళ్లి చేసుకుని సినిమాలకు దూరమైంది ప్రణీతా. ఇప్పుడు ప్రణీతకు ఇద్దరు పిల్లలు కూడా. పెళ్లి తర్వాత ప్రణీతా సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ సోషల్ మీడియా ద్వారా తన ఫ్యాన్స్ కు మాత్రం టచ్ లోనే ఉంది. అందులో భాగంగానే ఎప్పటికప్పుడు ఫ్యాన్స్ తో చిట్ చాట్ నిర్వహిస్తూ ఉండే ప్రణీతాను రీసెంట్ గా ఓ అభిమాని మీరు సినిమాల్లో ఎందుకు నటించడం లేదని అడగ్గా, దానికి ప్రణీతా తన పిల్లల వల్లే తాను సినిమాల్లో నటించడం లేదని, వారిని చూసుకోవడానికి సినిమాలకు దూరంగా ఉంటున్నట్టు ప్రణీతా వెల్లడించింది. పిల్లల కోసం కెరీర్ ను వదిలేసిన ప్రణీతాను ఇప్పుడంతా మెచ్చుకుంటున్నారు.

# పిక్ టాక్ : బర్త్డే బేబీ క్యూట్ పిక్స్



పెళ్లిసందడి సినిమాతో హీరోయిన్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. పెళ్లిసందడి సినిమాతో హీరోయిన్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. తెలుగు మూలాలు ఉండటంతో టాలీవుడ్లో చక్కగా రాణించగలుగుతోంది. తక్కువ సమయంలోనే టాలీవుడ్లో టాప్ స్టార్ హీరోయిన్గా నిలిచింది. మొదటి సినిమా పెళ్లి సందడి తీవ్రంగా నిరాశ పరచినా కూడా ఆ తర్వాత చేసిన సినిమాలు ఈ అమ్మడికి గుర్తింపు తెచ్చి పెట్టాయి. ముఖ్యంగా రవితేజతో కలిసి ఈమె చేసిన ధమాకా సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. రవితేజతో ఈమె చేసిన సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఎక్కువ ఆఫర్లు వచ్చాయి. ఒకానొక సమయంలో ఈ అమ్మడు ఒకే సారి ఆరు.. ఏడు ప్రాజెక్ట్లు చేసింది. గత ఏడాది ఈ అమ్మడు మహేష్ బాబు హీరోగా రూపొందిన గుంటూరు కారం సినిమాలో హీరోయిన్గా నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా నిరాశ పరచినా కూడా హీరోయిన్గా ఈమెకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టడంతో పాటు, హీరోయిన్గా మరిన్ని ఆఫర్లు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో క్రేజీ ప్రాజెక్ట్లు ఉన్నాయి. పాన్ ఇండియా రేంజ్లో ఈ అమ్మడు వరుస ప్రాజెక్ట్లు చేసేందుకు గాను పుష్ప 2 సినిమాలోని ఐటెం సాంగ్ ప్రముఖంగా ఉపయోగపడింది. పుష్ప 2 సినిమాలో ఈమె చేసిన ఐటెం సాంగ్ పాన్ ఇండియా రేంజ్లో ఓ ఊపు ఊపింది. అందుకే ఈమెకు హిందీ, తమిళ భాషల్లోనూ పలు సినిమాల్లో నటించే అవకాశాలు దక్కుతున్నాయి. తాజాగా శ్రీలీల తన పుట్టిన రోజు జరుపుకుంది. ఈ సందర్భంగా ఆమెకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేసింది. అంతే కాకుండా ఈమె తన బర్త్డే కి వచ్చిన శుభాకాంక్షలకు కృతజ్ఞతలు తెలియజేసింది. పుట్టిన రోజు సందర్భంగా తనకు శుభాకాంక్షలు చెప్పిన వారికి కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు ఇలా క్యూట్ ఫోటోలు షేర్ చేసింది. తన పుట్టిన రోజుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. అందుకు సంబంధించిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.ప్రస్తుతం శ్రీలీల పలు సినిమాల్లో నటిస్తుంది. ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేయడంకు రెడీ అవుతున్నాయి. ముఖ్యంగా ఈమె ఈ ఏడాదిలో తమిళ్ మూవీ తో రాబోతున్న నేపథ్యంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. హిందీలో కూడా ఈమె నటించే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి ఈ అమ్మడికి ఈ ఏడాది చాలా పెద్దగా ఉంటుందని అభిమానులు నమ్ముతున్నారు. తెలుగులో ఈమె చేయబోతున్న సినిమాలు కూడా చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. ఆకట్టుకునే అందంతో పాటు, డాన్స్ విషయంలో ఈ అమ్మడిని మించిన వారు టాలీవుడ్లో ఎవరు లేరు అని అభిమానులు అంటూ ఉంటారు. ఇదే విధంగా నటనతోనూ ఆకట్టుకుంటూ ఉంది.

%Editor, Printed, Published and Owned by RACHAKONDACHANDRASEKHAR RAO%, »»%HNO-14-15/3, INDIRA GANDHI NAGAR, VELDURTHI, VELDURTHI MANDAL, KURNOOL DIST, ANDHRAPRADESH..RNI APTEL/2023/88231 Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A. BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP . E-mail: yuvatharamtelugudaily@gmail.com, Cell: +9199899 24749.